# మన నేషనలిస్ట్ వాయిస్

తెలుగు దిన పత్రిక

RNI : TGTEL/25/A4284

www.manantionalistvoice.com epaper.manantionalistvoice.com

ప్రచురణ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | సంపుటి : 01 | సంచిక : 154 | 02 శనివారం, మే 2026 | పేజీలు :12 | వెల: రూ. 3/-

హైదరాబాద్, నిజామాబాద్, వరంగల్, కరీంనగర్, రంగారెడ్డి, ఆదిలాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్ నగర్, ఖమ్మం, విజయవాడ, గుంటూరు, అమరావతి, క్రిష్ణ, గోదావరి, కర్నూలు, చిత్తూరు, కడప, ప్రకాశం, శ్రీకాకుళం







# ఆర్టీసీ కార్మికుల సమ్మెకాలానికి జీతం

## ●మూడ్రోజుల సమ్మెలో పెట్టిన కేసుల ఎత్తివేత

## ●ఆర్టీసీ సంఘాలకు సిఎం రేవంత్ హామీ

**హైదరాబాద్,మే1 నేషనలిస్ట్ వాయిస్**



రాష్ట్రంలోని ఆర్టీసీ కార్మికులకు సీఎం రేవంత్ రెడ్డి గుడ్ న్యూస్ చెప్పారు. ఆర్టీసీ కార్మికుల 3 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని.. అలాగే, సమ్మె కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేస్తామని తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ నివాసంలో ఆర్టీసీ కార్మిక సంఘాల నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ కార్మికుల 3 రోజుల సమ్మె కాలానికి వేతనాలు ఇవ్వాలని, సమ్మె కాలంలో పెట్టిన కేసులు ఎత్తివేయాలని కార్మిక సంఘాల ప్రతినిధులు సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. కార్మిక సంఘాల నేతల అభ్యర్థనపై సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. సమ్మె కాలానికి 3 రోజుల వేతనం ఇచ్చేందుకు, కేసుల ఎత్తివేతకు అంగీకరించారు. ఈ మేరకు సమ్మె కాలంలో వేతనం, కేసుల ఎత్తివేతకు వెంటనే చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్, అధికారులను ఆదేశించారు. దీంతో తమ సమస్యల పరిష్కారం కోసం చొరవ చూపించినందుకు సీఎంకి కార్మిక సంఘాల ప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. డిమాండ్ల పరిష్కారం కోసం ఇటీవల తెలంగాణ ఆర్టీసీ కార్మికులు సమ్మెకు దిగిన విషయం తెలిసిందే. మూడు రోజుల పాటు సమ్మె చేశారు. దీంతో రంగంలోకి దిగిన ప్రభుత్వం ఆర్టీసీ కార్మికులతో చర్చలు జరిపింది. చర్చలు సఫలం కావడంతో ఆర్టీసీ కార్మికులు సమ్మె విరమించారు.

# ఉపాధి కూలీలతో కలసి పనిచేసిన సీతక్క

**ములుగు,మే1 నేషనలిస్ట్ వాయిస్**



మేడే సందర్భంగా కార్మిక సోదరులందరికీ మంత్రి సీతక్క శుభాకాంక్షలు తెలిపారు. ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం కేశవపూర్‌లో ఉపాధి హామీ పనుల్లో పలుగు పట్టి కార్మికులతో కలిసి మంత్రి సీతక్క పనులు చేశారు. అనంతరం కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధి కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎండల తీవ్రత అధికంగా ఉందని ఉదయం 10 గంటల వరకు పనులు ముగించుకొని ఇళ్లకు తిరిగి వెళ్లాలని కూలీలకు మంత్రి సీతక్క సూచించారు.

# ఆర్టీసికి అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

## ప్రభుత్వంలో సంస్థ విలీనంతో చిత్తశుద్ధి చాటాం

## మేడే ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్



**సిద్దిపేట,మే1 నేషనలిస్ట్ వాయిస్**

ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. గత ప్రభుత్వం మాదిరి వారు సమ్మె పట్టించుకోకుండా ఉండలేదన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడిన 48 గంటల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామని తెలిపారు. 140 సంవత్సరాలుగా ఏదో ఒక హక్కు డిమాండ్‌తో మేడే నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు.శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ ఆర్టీసీ బస్సు డిపోలో నిర్వహించిన మేడే ఉత్సవాల్లో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్‌కి శ్రద్ధాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడారు. ఆర్టీసీ కార్మికులు సమ్మెకు వెళ్తే వారి ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి వర్గం కార్మిక సంఘాలతో చర్చించి పలు అంశాలపై సానుకూల నిర్ణయం తీసుకున్నామని ప్రస్తావించారు.

# రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా కష్టపడుతున్నా

**విజయవాడ,మే1 నేషనలిస్ట్ వాయిస్**

రాష్ట్రాభివృద్ధి కోసం రాత్రిపగలు కష్టపడుతున్నామని, పేదల రుణం తీర్చుకునేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రజల సంతోషాన్ని చూసి.. కష్టాన్ని మరిచిపోతున్నట్లు చెప్పారు. కృష్ణా జిల్లా పమిడిముక్కలలో నిర్వహించిన 'పేదల సేవ' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని, ఏపీకి పూర్వవైభవం తీసుకొస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పింఛన్ల కోసం ఏటా రూ.33 వేల కోట్లు ఖర్చు పెడుతున్నాం. పింఛన్ల పంపిణీని భారంగా భావించట్లేదు.. బాధ్యతగా భావిస్తున్నామని చంద్రబాబు అన్నారు. దేశంలో ఏ రాష్ట్రం ఇంత పెద్ద మొత్తంలో పింఛన్లు ఇవ్వట్లేదు. కార్మికుల కోసం లేబర్ అడ్డా నిర్మాణాలు చేపడుతున్నాం. లేబర్ అడ్డాలు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా మారాలి. పని ఉంటే పనికెళ్తారు.. లేని రోజు లేబర్ అడ్డాల్లో నైపుణ్యం పెంచుకుంటారు. తొలి దశలో లేబర్ అడ్డాలు విజయవంతమైతే.. మిగిలిన ప్రాంతాలకు విస్తరిస్తాం అని చంద్రబాబు అన్నారు. గత ప్రభుత్వం నిర్వాకం వల్ల పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ప్రస్తుతం మళ్లీ వెయ్యి కోట్లతో పోలవరం డయాఫ్రమ్ వాల్ నిర్మిస్తున్నాం. 2027లో గోదావరి పుష్కరాల్లోపు పోలవరం పూర్తి చేస్తాం. ఆ తర్వాత కృష్ణా నదికి అనుసంధానిస్తాం. డిసెంబర్ నాటికి బందర్‌పోర్టు నిర్మాణం పూర్తి చేస్తాం. హైదరాబాద్- మచిలీపట్నం హైవే ఎక్స్‌ప్రెస్ రోడ్డుగా అభివృద్ధి చెందుతోంది.



● ప్రజల సంతోషం చూసి కష్టాలు మరచి పోతున్నా
● ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్టానిక్రి పూర్వ వైభవం
● లేబర్ అడ్డాలను స్కిల్ సెంటర్లుగా అభివృద్ధికి నిర్ణయం
● గోదావరి పుష్కరాల్లోపే పోలవరం పూర్తి చేస్తాం
● విద్యుత్ చార్జీలు పెంచలేదు..ఇకముందు పెంచబోం
● కృష్ణా జిల్లా పమిడిముక్కలలో 'పేదల సేవ'లో సిఎం బాబు

# గ్యాస్ ధరల పెంపు.. ఎలక్షన్ బిల్లు



## ●ధరలపై తాము ముందే చెప్పాం ●పెట్రో, డీజిల్ బాదుడుకు సిద్ధంగా ఉండాలి ●గ్యాస్ ధర పెంపుపై రాహుల్ విమర్శలు

**న్యూఢిల్లీ,మే1 నేషనలిస్ట్ వాయిస్**

దేశంలో వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరలు రూ.993 మేర పెరగడంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. త్వరలో పెట్రోల్, డీజిల్ వంతు వస్తుందని హెచ్చరించారు. ఎన్నికల తరువాత ధరాభారం పెరుగుతుందని తాను ముందే చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఇది ఎలక్షన్ బిల్లు అని వ్యాఖ్యానించారు. ఎక్స్ వేదికగా ఈ మేరకు పోస్టు పెట్టారు. కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ ధర మునుపెన్నడూ చూడని స్థాయిలో ఒక్కసారిగా పెరిగాయని రాహుల్ గాంధీ విమర్శించారు. ఫిబ్రవరి నుంచి ఇప్పటివరకూ రూ.1380ల మేర ధర పెరిగిందని అన్నారు. కేవలం మూడు నెలల్లోనే ధర 81 శాతం మేర పెరిగిందని వివరించారు. ఎన్నికల తరువాత ఇలా జరుగుతుందని తాను ముందే చెప్పానని గుర్తు చేశారు. 'టీ స్టాల్స్, ధాబాలు, బేకరీ, స్వీట్ షాపులు.. ఇలా అందరిపైనా భారం పెరిగింది. చివరకు మీ ఆహార ఖర్చులపైనా ప్రభావం పడుతుంది. మొదట ఎల్‌పీజీ గ్యాస్ వంతు.. ఆ తరువాత పెట్రోల్-డీజిల్ ధరల వంతు వస్తుంది' అని అన్నారు.

# ముంబైలో డ్రగ్స్ ముఠా అరెస్ట్

## ●రూ.1,745 కోట్ల విలువైన కొకైన్ స్వాధీనం

## ●ఎక్స్ వేదికగా హోంమంత్రి అమిత్ షా వెల్లడి

**ముంబయి,మే1 నేషనలిస్ట్ వాయిస్**

ముంబయిలో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో ఛేదించింది. ఆ ముఠా నుంచి రూ.1,745 కోట్ల విలువైన కొకైన్‌ను ఎన్‌సీబీ స్వాధీనం చేసుకుంది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఎక్స్ ద్వారా ఈ విషయాన్ని వెల్లడించారు. మాదకద్రవ్యాల రవాణాకు పాల్పడే ముఠాలను అణచివేయాలని నిర్ణయించుకున్నట్లు అమిత్‌షా తెలిపారు. ఇందులోభాగంగా.. నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాపై ఉక్కుపాదం మోపిందన్నారు. ముంబయిలో రూ.1,745 కోట్ల విలువైన 349 కిలోల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. ఒక చిన్న సరకును గుర్తించి.. దానినుంచి ఒక భారీ నెట్‌వర్క్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. ఈ విజయానికి గాను ఎన్‌సీబీ బృందాన్ని ఆయన అభినందించారు.



# గ్యాస్ ధరల పెంపు సామాన్యుడిపై భారం

## ఏకంగా రూ.993లకు పెంచడం దుర్మార్గం

## కేంద్రం తీరుపై మండిపడ్డ మంత్రి ఉత్తమ్

**హైదరాబాద్,మే1 నేషనలిస్ట్ వాయిస్**



కమర్షియల్ గ్యాస్ సిలిండర్ ధరను కేంద్ర ప్రభుత్వం అమాంతం పెంచి సామాన్యుడి నడ్డి విరిచిందని తెలంగాణ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని నరేంద్ర మోదీపై మంత్రి ఫైర్ అయ్యారు. గ్యాస్ ధర పెంపుతో సామాన్యుడిపై పెను భారం మోపారంటూ ఆగ్రహించారు. 19 కేజీల గ్యాస్ సిలిండర్ ధరను రూ.993లకు అంటే సుమారు వెయ్యి రూపాయలకు పెంచడం దుర్మార్గమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ధ్వజమెత్తారు. ఒక్కసారిగా 30 నుంచి 35 శాతం పెంచడంతో హోటళ్లు, రెస్టారెంట్లతో సహా చిన్నచిన్న వీధి వ్యాపారులపైనా తీవ్ర ప్రభావం పడనుందని మంత్రి ఉత్తమ్ మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్ ఎన్నికలు ముగిసి 24 గంటలు పూర్తి కాగానే కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని తీవ్ర విమర్శలు గుప్పించారు. కమర్షియల్ గ్యాస్ ధర పెంపుతో సామాన్యుల జీవన ప్రమాణాలపై కోలుకోలేని దెబ్బ పడిందని మంత్రి ఆరోపించారు.

# నేర నియంత్రణలో ఆధునిక టెక్నాలజీ వినియోగం

## నేరగాళ్ల టెక్నాలజీ సవాల్‌గా మారింది

## దేశంలో పటిష్టంగా తెలంగాణ పోలీసింగ్

## డ్రగ్స్ నియంతరణకు మరింత కఠన చర్యలు



డిజిపిగా సివి ఆనంద్ ప్రమాణస్వీకారం

**హైదరాబాద్,మే1 నేషనలిస్ట్ వాయిస్**

తెలంగాణ డీజీపీగా సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించారు. డీజీపీ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు పోలీసు ఉన్నతాధికారులు సాదరంగా స్వాగతం పలికారు. కార్యాలయ ఆవరణలో పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పండితులు వేద ఆశీర్వచనాలతో రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్‌గా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆశయాలు, ఆకాంక్షలు నెరవేరేలా కృషి చేస్తానన్నారు. శాంతిభద్రతల కోసం అహర్నిశలూ శ్రమిస్తానని చెప్పారు. కొత్త టెక్నాలజీని మరింతగా వాడుకుంటూ సమర్థంగా పని చేస్తామన్నారు. నేరాల దర్యాప్తులో తెలంగాణ పోలీసులు ఇప్పటికే ఉత్తమ పని తీరు కనబరిచారు. మారుతున్న పరిస్థితుల్లాగే నేరాలు జరుగుతున్న విధానం కూడా మారింది. నేరగాళ్లు సైతం కొత్త కొత్త టెక్నాలజీని అనుసరిస్తూ నేరాలు చేస్తున్నారు. ఇది పోలీసులకు సవాలుగా మారింది. ఎన్ని కేసులు పెట్టినా.. డ్రగ్స్ ముఠాలు కూడా విస్తరిస్తున్నాయి.

# ఎస్ ఎస్ సి ఫలితాలలో బీరంగూడ నారాయణ పాఠశాల 100% ఫలితాలతో ప్రభంజనం

**అమీన్పూర్ / నేషనలిస్ట్ వాయిస్ :**

బీరంగూడ లోని నారాయణ పాఠశాలలో విద్యార్థుల్లో వి మధురిమ రెడ్డి 595/600 మార్కులతో రాష్ట్రస్థాయిలో మూడవ స్థానంలో నిలిచింది పాఠశాలలో మొదటి స్థానంలో ప్రతిభను చాటగా. చరిత 587 మార్కులతో ద్వితీయ స్థానం దక్కించుకున్నారు. ఇతర విద్యార్థులకు కూడా మెరుగైన ఫలితాలు సాధించి పాఠశాల స్థాయిని నిలబెట్టారు. ఈ విషయంపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ. పాఠశాల అందించిన నాణ్యమైన విద్య ఉపాధ్యాయుల కృషి కారణంగానే పిల్లలు ఈ స్థాయి ఫలితాలు సాధించారని అభిప్రాయపడ్డారు.. ఈ సందర్భంగా పాఠశాల జిఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం వేణుగోపాల్, ఆర్ఐ చక్రధర్, ఆర్ అండ్ డి. శ్రీలక్ష్మి, కోఆర్డినేటర్ బాలకృష్ణ, ప్రిన్సిపల్ శ్రీవిద్య అకాడమిక్ డీన్ నరసింహారావు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందిస్తూ. వారి కృషి ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఫలితంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయి అని తెలిపారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థులపై ప్రశంసలు కురిపించారు. నారాయణ పాఠశాల చైర్మన్ రమాదేవి ఫలితాలు సాధించిన విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలియజేసి భవిష్యత్తులో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు, ఈ ఫలితాలతో పాఠశాల తన ప్రతిభను మరోసారి చాటుకుంది.






# కార్మిక కర్షక సోదరులకు (మే డే ) శుభాకాంక్షలు బి గడీల శ్రీకాంత్ గౌడ్

**పటాన్చెరు/ నేషనలిస్ట్ వాయిస్ :**

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం (మే డే) సందర్భంగా ఇస్నాపూర్ మున్సిపల్ చిట్కుల్ జి టి ఎన్ పరిశ్రమ వద్ద మరియు పాశంమైలారం పరిశ్రమిక వాడలో ఘనంగా వేడుకలు నిర్వహించబడ్డాయి ఈ సందర్భంగా పెట్ హ్యామండ్ పవర్ సొల్యూషన్స్ కార్మికులతో కలిసి జెండా ఆవిష్కరించిన పటాన్ చెరు మాజీ జెడ్పీటీసీ గడిల శ్రీకాంత్ గౌడ్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో కార్మికుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు, పరిశ్రమల ప్రగతికి కార్మికుల కష్టపడే నైజం, అంకితభావం ప్రధాన శక్తి అని అన్నారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు.కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం, యాజమాన్యం సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్మిక సంక్షేమమే సమాజ అభివృద్ధికి మూలస్తంభమని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో జి టి ఎన్ జనరల్ సెక్రటరీ సుధాకర్,వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ రెడ్డి,జాయింట్ సెక్రటరీ నరేష్,నాగు క్యాషియర్ నాగేంద్ర,మరియు యూనియన్ సభ్యులు కె.శ్రీను,పీఎస్ శ్రీను,జీతయ్య మరియు పెట్ జనరల్ సెక్రటరీ శివ కుమార్,వర్కింగ్ ప్రెసిడెంట్ కే.నర్సింహులు,వైస్ ప్రెసిడెంట్ కే.రవి,జాయింట్ సెక్రటరీ వి.ఎస్ కుమార్,ట్రెజరర్ వి.మాధవ చారి మరియు పరిశ్రమ కార్మికులు పాల్గొన్నారు.





# ప్రపంచ కార్మిక వర్గానికే దిక్సూచి చికాగో కార్మిక పోరాటం

## మే డే అంటే కార్మికుల పండగ.ఎర్రజెండాతోనే కార్మికుల హక్కులు కాపాడబడుతాయి.

## సీపీఐ చిగురుమామిడి మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ.

**కరీంనగర్ నేషనలిస్ట్ వాయిస్**

ఎనిమిది గంటల పని దినాలు,శ్రమకు తగ్గ ఫలితం దక్కాలని వీరోచితంగా జరిగిన చికాగో కార్మిక వర్గ పోరాటమే ప్రపంచ కార్మిక వర్గానికి దిక్సూచి అని ప్రపంచవ్యాప్తంగా కార్మికుల హక్కులు,చట్టాలను కాపాడేది ఒక్క ఎర్ర జెండాయేనని సీపీఐ చిగురుమామిడి మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ అన్నారు. 141వ మే డే సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం చిగురుమామిడి మండలం ఓగులాపూర్ గ్రామంలో సీపీఐ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఎర్ర జెండాను సీపీఐ మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ ఎగురవేశారు. ఈ సందర్భంగా బూడిద సదాశివ మాట్లాడుతూ కార్మికులకు పని గంటల వేలల్లో మార్పుల కోసం, హక్కుల కోసం,సమ్మె హక్కు కోసం అమెరికా లోని చికాగో నగరంలో 1886 లో లక్షలాది మంది కార్మికులు సమ్మె చేసి,అనేక మంది ప్రాణతర్పణంతో మే డే ఆరంభం అయిందని,ఆ స్ఫూర్తితో ప్రపంచ వ్యాప్తంగా కార్మికులు మేడే జరుపుకుంటున్నారని,నాటి నుండి నేటి వరకు ప్రపంచ దేశాలతో శ్రమను నమ్ముకొని జీవిస్తున్న అన్ని వర్గాల వారు జరుపుకునే ఏకైక పండగ మే డే అని,పోరాడి సాధించుకున్న హక్కుల ద్వారా నాడు కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండాయని,వారి పోరాటస్ఫూర్తితోనే దేశంలో కార్మికులు,కార్మిక సంఘాలు, సీపీఐ కార్మికవర్గ శ్రేయస్సు కోసం నిరంతం పోరాటాలు నిర్వహిస్తున్నాయని,నేటికీ కార్మికుల హక్కులు, వేతనాలు పెంచాలని,వారి చట్టాలను రక్షించుకోవడం కోసం ఎర్రజెండా పోరాటాలు నిర్వహిస్తున్నదని,బిజెపి మూడవసారి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగంలోని అనేక చట్టాలను మార్చాలని తీవ్ర ప్రయత్నం చేస్తుందని, ప్రధానంగా 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా విభజించి కార్మికులకు వారి హక్కులకు భంగం కలిగిస్తుందని వాటన్నిటినీ కాపాడుకోవడం




కోసం రానున్న రోజుల్లో కార్మికులంతా ఏకమై బిజెపి ప్రభుత్వ పాలనపై ఉద్యమిస్తూ పాలకులకు తగిన గుణపాఠం చెప్పాలని కార్మిక లోకానికి సదాశివ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ సీనియర్ నాయకులు మాజీ సర్పంచులు బోయిని మొండయ్య,కోమటి రెడ్డి జైపాల్ రెడ్డి,సిపిఐ నాయకులు ముస్కు మహేందర్ రెడ్డి,గట్టు మధు,బద్దం కొమురెల్లా రెడ్డి,బోయిని రాజయ్య, జెల్ల హరీష్,ఇల్లందుల ఈశ్వరయ్య,నాయిని బాలయ్య,గాలిపెల్లి గంగారెడ్డి,జూపల్లి పోచయ్య,బోయిని కొమురయ్య, కవ్వంపల్లి బాలయ్య, గున్నా లక్ష్మణ్, ఎంద్ర అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వామివారి మాస కళ్యాణం

**గంపలగూడెం, నేషనలిస్ట్ వాయిస్**

తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన, ఎన్టీఆర్ జిల్లా, గంపలగూడెం మండలం, నెమలి గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ వేణుగోపాల స్వామి వారి స్థానము నందు శుక్రవారం నాడు స్వామివారి మాస కళ్యాణం ఘనంగా జరిగినట్లు ఆలయ అధికారులు తెలిపారు. పౌర్ణమి సందర్భంగా స్వామివారి మాస కళ్యాణంలో పీటల మీద 12 మంది దంపతులు కూర్చున్నారు. ఈ కార్య క్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు టి గోపాలచార్యులు, గ్రామ పెద్దలు బెల్లం మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రెస్టేజ్ ట్రాన్క్విల్ హ్యాపీ ఫ్రెండ్స్ వాకింగ్ గ్రూప్ ఆధ్వర్యం లో చలివేంద్రం

## ప్రారంభించిన అధ్యక్షురాలు కావ్య, నారాయణ స్వామి

**హైదరాబాద్,గండిపేట్: నేషనలిస్ట్ వాయిస్**

వేసవిలో చలివేంద్రాలు ఏడారిలో ఒయాస్సిస్సు లాంటివే. అక్కడ ఇక్కడ అని కాదు ఎక్కడైనా సరే భగభగ మండే ఎండలో పప్రజల దాహార్తిని తీర్చగలగటం పుణ్యమె. అందుకే కొద్దొ గొప్పొ సమాజ అవగాహన వుండి సేవా భావంతో వున్న వాళ్ళు వేసవిలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చుతుంటారు. ఇందులో బాగంగానే శు క్రవారం గండిపేట్ మండలం కోకాపేట్ లోను సీనియర్ సిటిజన్స్ ముందుకు వచ్చి మెము సైతం అంటూ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ప్రెస్టేజ్ ట్రాన్క్విల్ హ్యాపీ ఫ్రెండ్స్ వాకింగ్ గ్రూప్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేసి మంచినీళ్ళు, మజ్జిగ ప్రజలకు అందించేలా ఏర్పాట్లు చేశారు. గ్రూప్ అధ్యక్షురాలు కావ్య, నారాయణ స్వామి లు చలివేంద్రం ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చటానికి మె నెల మొత్తం మంచినీళ్ళు మజ్జిగ అందించనున్నట్లు తెలిపారు. చలివేంద్రం లో చల్లని నీరు, మజ్జిగ ప్రతి రోజూ ఇవ్వబడుతుందని అన్నారు. ఈ చలివేంద్రం ఈ నెల ఒకటవ తేదీ నుండి 31 తేదీ వరకు నిర్వహించ బడుతుంది. ఈ కార్యక్రమం లో వాకింగ్ గ్రూప్ సభ్యులు వెంకటేశ్వర రెడ్డి , శాస్త్రి, మూర్తి , శశిధర్ , ఇతర గ్రూపు సభ్యులు పాల్గొన్నారు. కోకపేట లోని మిగిలిన గేటెడ్ కమ్యూనిటీ లకు ఇది ఆదర్శం గా నిలుస్తుందని ఆశిద్దాం.





# హనుమాన్ హిందూ సమ్మేళన సమితి( ఆదర్శ్ నగర్ బస్తి) ఆద్వర్యంలో ఘనంగా హిందూ సమ్మేళనం

**కరీంనగర్ నేషనలిస్ట్ వాయిస్**

కరీంనగర్ పట్టణం (ఆదర్శ్ నగర్ బస్తి )హనుమాన్ హిందూ సమ్మేళన సమితి ఆద్వర్యంలో నిర్వహించినహిందూ సమ్మేళనం ఘనంగా జరిగింది. హిందూ సమ్మేళనం కార్య నిర్వహణ సమితి అధ్యక్షులు మెతుకు కనుకయ్య ప్రధాన కార్యదర్శి కస్తూరి సుధాకర్ ,మహిళవక్త భోయిని జయప్రద మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని, సంస్కృతి సాంప్రదాయాలను పరిరక్షించుకోవడానికి హిందువులంతా కృషి చేయాలన్నారు. హిందూ సమాజం ఐక్యతతో ముందు కొనసాగాలన్నారు. భారతీయ సంస్కృతి లో మహిళ శక్తి కి ఎంతో ప్రాధాన్యత ఉందని , మహిళ గొప్పతనం గురించి మాటల్లో వర్ణించలేమన్నారు. ప్రధాన వక్త ఆదరణీయ కొంపల రాజన్న హిందూ సమాజంపై జరుగుతున్న దాడిని, వాటిని ఎలా ఎదుర్కొవాలనే విషయాలపై , హిందూ ఐక్యత గురించి వివరించారు. ప్రధాన అర్చకులు విశ్వపతి శర్మ దేవాలయం గొప్పతనం గురించి హిందూ సంస్కృతి గురించి వివరించారు, అధ్యక్షుడు మెతుకు కనుకయ్య మాట్లాడుతూ హిందూ సమాజ సంఘటిత శక్తి కోసమే మనం హిందూ సమ్మేళనాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. హిందువులు గుడికి వెళ్ళే ఆవశ్యకత ను తెలియజేస్తూ మాట్లాడారు. కార్యక్రమ అనంతరం మహిళలకు గాజులు, పసుపు కుంకుమ ను ఈ సందర్భంగా సమితి అందజేసింది.




# కార్మికులను గౌరవించాలి గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ

## ఎఫ్ త్రీ సొసైటీ ల సభలో వక్తల పిలుపు

కష్టించి పనిచేసే వారిని గౌరవించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని కార్మిక కర్షక విద్యార్థి లోకం సామాజిక చైతన్యం కోసం కృషి చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని వక్త లు పిలుపునిచ్చారుశుక్రవారం నాడు ఇబ్రహీంపట్నం వినోబా నగర్ లో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ వినోబా బావే డెవలప్మెంట్ సొసైటీ. ఎఫ్ త్రీ సొసైటీ లు సంయుక్తంగా మే డే కార్మిక దినోత్సవము సందర్భంగా కార్మికులను సన్మానించారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ వైస్ చైర్మన్ డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డి ఎఫ్ త్రీ సొసైటీ సీఈవో ఎలుగూరి స్రవంతి రెడ్డి ల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ డాక్టర్ యానాల ప్రభాకర్ రెడ్డికేంద్ర సెన్సార్ బోర్డ్ సభ్యులు డాక్టర్ మెరుగు మధు గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ కార్యదర్శి గాంధారి ప్రభాకర్ ఎఫ్ త్రీ సి.ఈ. ఓ ఎలుగూరి స్రవంతి రెడ్డి సంఘ సేవకులురూపాని లింగస్వామి కిషోర్ గాంధీ గ్లోబల్ సాహితి అధ్యక్షులు కే గోపాల్ జి. గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ నేతలు పల్లె శ్రీనివాస్ గౌడ్ దొరస్వామి పవన్ కుమార్ లు కార్మిక దినోత్సవం సందర్భంగా పురస్కరించుకొని ప్రసంగించగా ఈ సందర్భంగా వినోద్ నగర్ డెవలప్మెంట్ సొసైటీలో పనిచేస్తున్న 30 మంది కార్మికులను ఘనంగా సత్కరించారు





# నేడు 19వ వార్షికోత్సవానికి ముస్తాబైన షిర్డీ సాయిబాబా ఆలయం

## -తూప్రాన్‌లో భక్తి పారవశ్యానికి వేదికగా మారనున్న షిర్డీ సాయి బాబా ఆలయం

## -అట్టహాసంగా నిర్వహించేందుకు సన్నాహాలు

**తూప్రాన్, మే, 2. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఎదురుగా సాయి నగర్ లో వెలసిన ఈ పవిత్ర ఆలయం భక్తుల ఆధ్యాత్మిక కేంద్రముగా ప్రసిద్ధి చెందింది. ఆలయ వ్యవస్థాపకులు, ధర్మకర్త, అధ్యక్షులు ఎనరెల్లి వెంకటస్వామి ఆధ్వర్యంలో మే 2వ తేదీ శనివారం నిర్వహించనున్న 19వ వార్షికోత్సవానికి విశేష ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయం నుంచే వేదమంత్రాల నడుమ గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం సాయి బాబా విగ్రహానికి పవిత్ర అభిషేకాలు, సుగంధ ద్రవ్యాలతో అలంకరణలు, అర్చనలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణం అంతా పూల దండలు, విద్యుత్ దీపాలతో అలంకరించి, భక్తి సంగీత నాదాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ మహోత్సవానికి పరిసర గ్రామాల నుంచే కాకుండా దూర ప్రాంతాల నుండి కూడా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశముందని నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, కూర్చునే ఏర్పాట్లు, అన్ని వసతులను సమకూరుస్తున్నారు. పూజా కార్యక్రమాల అనంతరం సాయి బాబా ఆశీస్సులతో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నారు. వేలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించనున్నారని తెలిపారు. అన్నదానం సేవను అత్యంత పవిత్రమైనదిగా భావిస్తూ, ప్రతి ఒక్కరూ పాల్గొని సాయి కృపను పొందాలని నిర్వాహకులు కోరుతున్నారు.ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు ఎనరెల్లి వెంకటస్వామి మాట్లాడుతూ, “సాయి బాబా ఆశీస్సులతో ఈ ఆలయం 19వ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ప్రతి సంవత్సరం లాగానే ఈసారి కూడా భక్తుల సహకారంతో వేడుకలను విజయవంతం చేయాలని ఆశిస్తున్నాము. భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి పూజల్లో పాల్గొని, అన్నదానంలో భాగస్వాములు కావాలి” అని పిలుపునిచ్చారు. భక్తి, సేవ, సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఈ వార్షికోత్సవం తూప్రాన్ పట్టణంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపనుంది. సాయి నామస్మరణతో మార్మోగే ఈ వేడుకలు భక్తులకు ఆత్మీయ ఆనందాన్ని పంచనున్నాయి.



తూప్రాన్ లో 19వ వార్షికోత్సవానికి ముస్తాబైన షిర్డీ సాయిబాబా ఆలయం

# తూప్రాన్‌లో ఘనంగా మే డే వేడుకలు

**తూప్రాన్, మే, 1. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం సందర్భంగా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాలతో కలిసి జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర మాజీ ఫారెస్ట్ డెవలప్మెంట్ చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి కార్మికులను శాలువాలతో సన్మానించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు దేశానికి వెన్నెముకలాంటివారని, దేశ రక్షణ ఎంత ముఖ్యమో దేశ శుభ్రత, అభివృద్ధిలో కార్మికుల పాత్ర అంతే కీలకమని అన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలంటే కార్మికుల శ్రమే ప్రధాన కారణమని పేర్కొన్నారు. మే డే ప్రాముఖ్యతను వివరించిన ఆయన, 1886 మే 1న అమెరికాలోని షికాగో హే మార్కెట్‌లో ఎనిమిది గంటల పని విధానం కోసం కార్మికులు చేపట్టిన పోరాటం కారణంగా ఈ దినోత్సవం ఆవిర్భవించిందని తెలిపారు. ఆ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికులను స్మరించుకుంటూ ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం మే 1న కార్మిక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. 1923 నుంచి భారతదేశంలో కూడా మే డేను జరుపుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ రాథోడ్ జైపాల్ నాయక్, చెలిమెల రాములు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రఘుపతి ప్రభాకర్ రెడ్డి, కొక్కొండ కాశిరెడ్డి, పోతురాజు ధనరాజ్, బుక్క విజయకుమార్, సతీష్ చారి, బజారు చక్రవర్తి, నాగేంద్రతో పాటు కార్మిక సంఘ నాయకులు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఉజ్వల భవిష్యత్తుకు ‘బాల భరోసా’ ఒక వరం

## -జిల్లా కలెక్టర్ అంకిత్- మాతా శిశు సంరక్షణ కేంద్రంలో ఘనంగా “బాల భరోస” కార్యక్రమం





**భద్రాద్రి కొత్తగూడెం, మే1(నేషనలిస్ట్ వాయిస్ ):**

ఉజ్వల భవిష్యత్తుకు ‘బాల భరోసా’ ఒక వరమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. స్థానిక జిల్లా కేంద్రంలోని రామవరం మాతా శిశు సంరక్షణ కేంద్రంలో జిల్లా సంక్షేమ అధికారిణి జె.స్వర్ణలత లేనినా ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా స్థాయి “బాల భరోస” కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగాజిల్లా కలెక్టర్ అంకిత్ పాల్గొని మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యమే లక్ష్యంగా, వారి ఎదుగుదలలో తలెత్తే లోపాలను తొలిదశలోనే గుర్తించి నివారించేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ‘బాల భరోసా’ కార్యక్రమం అన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గతవారం రోజులుగా క్షేత్రస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అదేవిధంగా ముఖ్యంగా సున్నా నుండి ఐదు సంవత్సరాలలోపు చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పిల్లల్లో ఉండే న్యూరో డెవలప్‌మెంట్(నాడీ వ్యవస్థ సంబంధిత) సమస్యలు శారీరక ఎదుగుదల లోపాలు మానసిక వికాసంలో ఆలస్యంవంటి అంశాలను ప్రారంభ దశలోనే గుర్తించడం ద్వారా వారికి మెరుగైన చికిత్స అందించే అవకాశం ఉంటుందని దానికి అనుగుణంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేసి ఆరోగ్య తెలంగాణ నిర్మాణానికి భాగస్వామ్యం కావాలన్నారు. ప్రతి చిన్నారి శారీరక మానసిక స్థితిని నిశితంగా పరిశీలించి అవసరమైన వారికి ప్రత్యేక వైద్య సేవలు అందించడం, చిన్నారులు ఆరోగ్యంగా సంతోషంగా పెరిగేలా చూడటమే కాకుండా వారి భవిష్యత్తుకు భరోసా కల్పించాలన్నారు. అదేవిధంగా జిల్లా సంక్షేమ అధికారిణి జె.స్వర్ణలత లేనినా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 2061 కేంద్రాలలో నమోదైన సున్నా నుండి ఐదు సంవత్సరాలలోపు అంగన్వాడి కేంద్రాలలో నమోదైన పిల్లలను ఆర్బిఎస్కె టీముల ద్వారా ముందస్తు అనారోగ్య గుర్తింపులో భాగంగా న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టం ద్వారా జిల్లాలో ఉన్న 60000 మంది చిన్నారులను 42 ప్రశ్నల ద్వారా ఆన్లైన్ పోర్టర్లలో వివరాలను నమోదు చేయడం జరిగిందని దానికి అనుగుణంగా పిల్లల అభివృద్ధిలో వెనకడుగు, న్యూరో డెవలప్మెంట్ శారీరక లోపాలు ఉన్న పిల్లలను గుర్తించి జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక పర్యవేక్షణతో కూడిన పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఈ ఒక్క అవకాశాన్ని సద్వినియోగం ఈరోజు మాత్రమే చేసుకోకుండా సూచించిన తేదీలలో క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు నిర్వహించుకోవాలని అంగనవాడి టీచర్లను సకాలంలో జోక్యం చేసుకొని స్థానిక ప్రాథమిక వైద్య కేంద్రాలలో చికిత్స అందించి పిల్లల సంపూర్ణ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. ప్రతి చిన్నారి ఆరోగ్యంగా సంతోషంగా సురక్షితమైన భవిష్యత్తును నిర్మించే బాధ్యత మన అందరిపై ఉందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ 0నుండి 5 సంవత్సరాల పిల్లలు అందిస్తున్న సేవలను మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని సిబ్బందిని అడిగి తెలుసుకుని మెరుగైన సేవలు అందించాలని మాతా శిశు సంరక్షణ కేంద్రంలోని ప్రతి విభాగాన్ని పరిశీలించి సూచనలు జారీ చేయడం జరిగింది. తదుపరి “బేటి బచావో” కార్యక్రమంలో భాగంగా “భేటీ జన్మోత్సవ్” నిర్వహించి నెలలోపు జన్మించిన ఆడపిల్లలకు బేటి జన్మోత్సవ్ కిట్లను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది డాక్టర్ ప్రతాప్, డాక్టర్ వినోద్, నాగభూషణం, పీడియాట్రిషన్ డాక్టర్లు, జిల్లా స్థాయి ఆర్బిఎస్కె సిబ్బంది, నేషనల్ న్యూట్రిషన్ మిషన్ జిల్లా సమన్వయకర్త పి.సంపత్, సిడిపివోలు లక్ష్మీ ప్రసన్న, వెంకటరమణ, సూపర్వైజర్లు, అంగనవాడి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ ను కేటాయించాలి

## - ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్

## -సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు మే డే శుభాకాంక్షలు

**భద్రాద్రి కొత్తగూడెం, మే 1(నేషనలిస్ట్ వాయిస్ ):**

ప్రభుత్వ ప్రవేట్ శాఖలోని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ ను కేటాయించాలని అభ్యుదయ కళాసేవ సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ అన్నారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా శుక్రవారం సింగరేణి ట్రాన్సిట్ గెస్ట్ హౌస్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మద్దెల శివకుమార్ మాట్లాడుతూ మేడే ప్రాధాన్యతను వివరించారు. తనకు కార్మికులు అంటే ఎంతో ప్రాణమని కార్మికులు లేనిదే ఈ దేశం మనుగడ ముందుకు సాగదన్నారు. అనంతరం కార్మిక కర్షక కూలీ నాలి కొరకు తన మహా కవిత్వాన్ని ప్రజా కవిత్వాన్ని అంకితం చేసి సమాజాన్ని జాగృతం చేసిన మహాకవి శ్రీశ్రీ కొన్ని కవితలను పద్యాలను ఆచార్య డాక్టర్ మద్దెల ఆలపించి అందరిని అలరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు సింగరేణి ట్రాన్సిట్ గెస్ట్ హౌస్ రిసెప్షనిస్ట్ శ్రీనివాస్, డైనింగ్ ఇంచార్జ్ రమేష్, వాచ్ మన్ ప్రేమ్, పూర్ణ, ఇతర ట్రాన్సిట్ గెస్ట్ హౌస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# కీర్తి ఆర్ట్స్ అకాడమీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మే డే ఉత్సవాలు

## కార్మికులను సన్మానించిన బిందు లిమ్మా

**హైదరాబాద్, మే, 1. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**

కార్మికుల పండుగగా గుర్తింపు పొందిన ఇంటర్ నేషనల్ వర్కర్స్ డే, మే డే సందర్భంగా కీర్తి ఆర్ట్స్ అకాడమీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు విశేషంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కీర్తి ఆర్ట్స్ అకాడమీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సమాజానికి సేవలందిస్తున్న పలు వర్గాల కార్మికులకు గౌరవ సూచకంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ట్రస్ట్ చైర్మన్ శ్రీమతి బిందు లిమ్మా గారు ముఖ్య అతిథిగా పాల్గొని, కార్మికుల పట్ల తన కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు. నగర అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది, ఆశా వర్కర్లు, బస్ డ్రైవర్లు, కండక్టర్లు, గృహిణులు (హౌస్ మేకర్స్) వంటి వివిధ వర్గాలకు చెందిన వారికి తువ్వాళ్లు, శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా బిందు లిమ్మా గారు మాట్లాడుతూ “సమాజం సక్రమంగా నడవడానికి ప్రతి కార్మికుడి కృషి అత్యంత కీలకం. వారి సేవలు అపారమైనవి. మే డే వంటి ప్రత్యేక దినాల్లో వారికి గౌరవం తెలపడం మన బాధ్యత” అని అన్నారు. ముఖ్యంగా కరోనా కాలంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి సేవలందించిన ఆశా వర్కర్లు, శుభ్రత కార్మికులు చేసిన సేవలను ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. కార్యక్రమంలో పాల్గొన్న కార్మికులు ట్రస్ట్ చేసిన ఈ కార్యక్రమంపై ఆనందం వ్యక్తం చేస్తూ, తమను గుర్తించి గౌరవించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటు వంటి సేవా కార్యక్రమాలు మరింత మంది ముందుకు రావడానికి ప్రేరణగా నిలుస్తాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, స్థానిక ప్రముఖులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కీర్తి ఆర్ట్స్ అకాడమీ చారిటబుల్ ట్రస్ట్ సమాజ సేవలో ముందుండి ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం నిర్వహిస్తుండటం విశేషంగా నిలుస్తోంది.



# ఏర్గాట్లలో సీసీ డ్రైనేజీ నిర్మాణ పనులకు శ్రీకారం...

**ఏర్గట్ల, మే 01,నేషనలిస్ట్ వాయిస్ (ప్రతినిధి)**

ఏర్గట్ల: మండల కేంద్రంలో పారిశుధ్య సమస్యల పరిష్కారానికి పెద్దపీట వేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ కొలిప్యాక ఉపేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నూతనంగా చేపట్టనున్న సి.సి. డ్రైనేజీ (మురికి కాలువ) నిర్మాణ పనులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, మురికినీటి సమస్య తలెత్తకుండా శాశ్వత ప్రాతిపదికన డ్రైనేజీ కాలువలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సున్నపు లక్ష్మి, గ్రామ కమిటీ అధ్యక్షులు నడిపి ముత్తెన్న, వివిధ వార్డుల సభ్యులు, గ్రామ కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ఏర్గట్ల మండలంలో ఘనంగా మే డే వేడుకలు...

**ఏర్గట్ల మే 01నేషనలిస్ట్ వాయిస్ (ప్రతినిధి)**

**ఏర్గట్లలో** : మండల కేంద్రంలో 140వ ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ıఖజ× రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్గట్ల పంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల నాయకులు డ్రైవర్ గంగన్న సుత్తి కొడవలి ఎర్రజెండాను ఎగురవేశారు. అనంతరం సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ మండల కార్యదర్శి జి.కిషన్, జిల్లా ఉపాధ్యక్షురాలు వి.సత్తెమ్మ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను యధావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంగారం, సాంబయ్య, లక్ష్మి, రాజేందర్, పోచయ్య, మల్లయ్య, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

**తడపాకల్లో** : మండలంలోని తడపాకల్ గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో కలిసి మే డే సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ జింక స్వప్న అనిల్ కుమార్ కూలీలకు మిఠాయిలు పంపిణీ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్మికుల శ్రమతోనే దేశం అభివృద్ధి చెందుతుందని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లోలపు రాజు, కార్యదర్శి రాకేష్, ఫీల్డ్ అసిస్టెంట్ అనిల్, కారోబార్ హన్మండ్లు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.





# మేడే స్ఫూర్తితో కార్మిక హక్కుల రక్షణకై పోరాటం

## -లేబర్ కోడ్ లు కార్మికుల మెడకు ఉరితాళ్లు-సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు





**భద్రాద్రి కొత్తగూడెం,మే1(నేషనలిస్ట్ వాయిస్ ):**

మేడే స్ఫూర్తితో పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కుల రక్షణకై మరో పోరాటానికి సిద్ధం కావాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొత్తగూడెంలో పలు చోట్ల జెండావిష్కరణలు జరిపిన అనంతరం సిపిఎం కార్యాలయం వద్ద జెండావిష్కరణ కార్యక్రమాన్ని మేడే సభను నిర్వహించారు. ముందుగా కార్యాలయంపై మచ్చ వెంకటేశ్వర్లు అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూట నలభై సంవత్సరాల క్రితం కార్మికలోకం కదంతొక్కి ఎనిమిది గంటల పని దినాన్ని సాధించుకుందని వారి త్యాగాలకు పోరాటాలకు చిహ్నం మేడే అని ఆయన తెలియజేశారు. 140 ఏళ్ల క్రితం ఎనిమిది గంటల పని విధానం కావాలని కార్మిక లోకం పోరాడి ప్రాణ త్యాగాలు చేసి ఎనిమిది గంటల పని విధానంతో పాటు కార్మికులకు హక్కులు సాధించి పెట్టారని ఆయన గుర్తు చేశారు. కానీ నేడు అధికారంలో ఉన్న కేంద్ర ప్రభుత్వం మేడే స్ఫూర్తిని దెబ్బతీసి తిరిగి మళ్ళీ కార్మికులను కట్టు బానిసలుగా చేసే లేబర్ కోడ్లు తీసుకొచ్చి కార్మిక చట్టాలను రద్దు చేసిందని ఆయన ధ్వజమెత్తారు. కార్మిక చట్టాల రద్దు వలన కార్మికుల గొంతు నొక్కే కుట్రలు సాగించడమే అని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్లు కార్మికుల మెడకు ఉరితాళ్లు వంటివని ఆయన అన్నారు. కేరళలో ఉన్న వామపక్ష ప్రభుత్వ మాత్రమే తమ రాష్ట్రంలో పని గంటల పెంపును అమలు చేయమని లేబర్ కోడులను అమలు చేయమని తీర్మానం చేసిందని కానీ మన రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ విధానాలకు తలొగ్గి ఈ రాష్ట్రంలో 10 గంటల పని విధానాన్ని తీసుకొచ్చారని ఆయన ఆరోపించారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కుల సాధనకై తిరిగి మరో చికాగో పోరాటానికి కార్మిక వర్గం సన్నద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

వామపక్షాల పాలనలో భూతల స్వర్గాన్ని తలపించే విధంగా సంక్షేమాన్ని అభివృద్ధిని చేసి చూపించామన్నారు. అనేక అడ్డంకులు ఎదురైనా మార్క్స్-ఏంగెల్స్ మౌలిక సిద్ధాంతానికి అనుగుణంగా పాలన సాగించామని వారి ఆశయాల అమలుకు నిరంతరం శ్రమించామన్నారు. ప్రస్తుత కాలంలో వామపక్షాలకు బలం తగ్గినా ఆదరణ తగ్గలేదని పేర్కొన్నారు. ప్రస్తుత రాజకీయ పరిణమాలు సామ్రాజ్యవాద పతనానికి దారితీస్తున్నాయని అందుకు నిదర్శనం అమెరికా-ఇజ్రాయిల్ వైఖరే కారణమన్నారు. గత కొంత కాలంగా సాగినా ఇరాన్-అమెరికా యుద్ధంలో ట్రంప్ ప్రపంచ వ్యాప్తంగా అపఖ్యాతి మూటకట్టుకున్నారని ఎద్దేవా చేశారు. కానీ మోడీ ట్రంప్కు బానిసగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అంతేకాకుండా కుటీల రాజకీయాలతో ప్రజాస్వామ్యాన్ని అవమానపరుస్తున్నారని ఈడీ, ఐటీ, సీబీఐ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పి అనైతికంగా ఆప్ ఎంపీలను బీజేపీలోకి ఆహ్వానించారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి.మధు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లిక్కి బాలరాజు, జిల్లా కమిటీ సభ్యులు భూక్య రమేష్, నాయకులు నందిపాటి రమేష్, జనుమాల నగేష్, సూరం ఐలయ్య, ఎస్ లక్ష్మి, ఆలేటి శ్రీను, కే హెచ్ ప్రసాద్, రాజారావు, వై.వెంకటేశ్వరరావు, ఎమ్మెస్ ప్రకాష్, సుదర్శన్, సమ్మయ్య, లింగయ్య, నాగకృష్ణ, దుర్గమ్మ, బాలకృష్ణ, రాములు, రఘు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'ఇంటర్నేషనల్ డ్యాన్స్ డే' వేడుకలు కళల ద్వారా సేవా భావానికి నాంది

**హైదరాబాద్, బంజారాహిల్స్, మే 1. నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి:**












అంతర్జాతీయ నృత్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కీర్తి ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 'ఇంటర్నేషనల్ డ్యాన్స్ డే సెలబ్రేషన్--2026' కార్యక్రమం బంజారాహిల్స్లో అత్యంత వైభవంగా నిర్వహించారు. కళలకు ప్రాధాన్యం ఇచ్చే ఈ వేడుకలు సేవా దృక్పథంతో, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా మెగా టాలెంట్ బుక్ ఆఫ్ రికార్డ్స్లో స్థానం సంపాదించాలనే లక్ష్యంతో నృత్య ప్రదర్శనలు, సమూహ నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారుల నుంచి యువత వరకు వందలాది మంది కళాకారులు పాల్గొని తమ ప్రతిభను అద్భుతంగా ప్రదర్శించారు. భిన్న భిన్న నృత్య రూపాలు, భారతీయ సాంప్రదాయ కళల సమ్మేళనం ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ అభివృద్ధిలో కళల పాత్ర ఎంతో కీలకమని, యువత తమ ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి వేదికలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కళలు మన సంస్కృతిని నిలబెట్టే శక్తిగా ఉంటాయని, సేవా కార్యక్రమాలతో కలిపి నిర్వహించడం మరింత స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ దర్శకుడు బాబ్జీ, ప్రముఖ న్యూమరాలజిస్ట్ దైవజ్ఞ శర్మ, సామాజిక కార్యకర్త బొంతల రాధిక పాల్గొని కళాకారులను అభినందించారు. మొత్తంగా ఈ 'ఇంటర్నేషనల్ డ్యాన్స్ డే' వేడుకలు కళా ప్రదర్శనలతో పాటు సేవా స్ఫూర్తిని కలగలిపిన స్ఫూర్తిదాయక కార్యక్రమంగా నిలిచాయి. పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఈ వేడుకలను స్మరణీయంగా మార్చారు. కీర్తి ఆర్ట్స్ అకాడమీ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షురాలు బిందు అమ్మ మాట్లాడుతూ కళలను ప్రోత్సహించడం తమ ప్రధాన లక్ష్యమని, సమాజానికి ఉపయోగపడే విధంగా మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా సేవా కార్యక్రమాలు కూడా నిర్వహించడం ప్రత్యేకంగా నిలిచింది. అవసరమైన వారికి సహాయం అందిస్తూ, కళల ద్వారా సమాజానికి సేవ చేయాలనే సందేశాన్ని అకాడమీ సభ్యులు అందించారు.

# ప్రమాదాలను అరికట్టేందుకు రహదారుల అభివృద్ధి ఎమ్మెల్యే టీ. రామ్మోహన్ రెడ్డి...

## పరిగి--వికారాబాద్ నాలుగు లైన్ల రహదారి పనులను పరిశీలిన

**పరిగి (నేషనలిస్ట్ వాయిస్ , ప్రతినిధి) మే 01**

పరిగి నుంచి వికారాబాద్ వరకు నిర్మిస్తున్న నాలుగు లైన్ల రహదారి పనులను పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి శుక్రవారం పరిశీలించారు. పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకొని,నాణ్యతలో ఎలాంటి లోపాలు లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ రహదారిపై అలాగే పరిగి--షాద్ నగర్ మార్గంలో గతంలో అనేక మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే పరిగి నుండి వికారాబాద్ వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు, పరిగి నుండి షాద్నగర్ వరకు నాలుగు లైన్ల రహదారి పనులు వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. లాల్ పహాడ్ నుండి చిట్టెంపల్లి వరకు డబుల్ రోడ్డు,గడిసింగాపూర్ నుండి రంగారెడ్డిపల్లి వరకు డబుల్ రోడ్డు పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రమాదాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోకుండా ఉండేందుకు రహదారి నిర్మాణ పనులను వేగవంతంగా చేపడుతున్నామని ఎమ్మెల్యే తెలిపారు.



# మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ను కలిసిన పరిగి నియోజకవర్గ ముదిరాజ్ సంఘం నాయకులు

**పరిగి (నేషనలిస్ట్ వాయిస్ , ప్రతినిధి) మే 01**

పూడూరు మండలం మన్నె గూడలో శుక్రవారం జరిగిన ఓ వివాహానికి హాజరైన మాజీ ఎమ్మెల్సీ, తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ను పరిగి నియోజకవర్గ ముదిరాజ్ సంఘం గౌరవ అధ్యక్షులు దోమ రామచంద్రయ్య ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి ముకుంద నాగేశ్వర్ ముదిరాజ్, యువత నియోజకవర్గ అధ్యక్షులు పర్షమోని బాబు ముదిరాజ్, నాయకులు బంధయ్య ముదిరాజ్ తదితరులు మర్యాద పూర్వకంగా కలిశారు.



# జితేందర్ రెడ్డి సేవలు చిరస్మరణీయం

## - సింగరేణి సూపర్ బజార్ డివిజనల్ మేనేజర్ దేవదాస్ - జితేందర్ రెడ్డి స్వప్న దంపతులకు ఘన సన్మానం

**భద్రాద్రి కొత్తగూడెం, మే1(నేషనలిస్ట్ వాయిస్ ):**

సింగరేణి కాలరీస్ కోఆపరేటివ్ హెచ్.పీ గ్యాస్ సేల్స్ మెయిన్ గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన కేసర జితేందర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని సింగరేణి కాలరీస్ సూపర్ బజార్ డివిజనల్ మేనేజర్ దేవదాస్ అన్నారు. జితేందర్ రెడ్డి ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా ఆయనను సింగరేణి సూపర్ బజార్ భవన్ లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో డివిజనల్ మేనేజర్ దేవదాసు మాట్లాడుతూ జితేందర్ రెడ్డి పలు ప్రాంతాలలో చిత్తశుద్ధితో పని చేసి సేవలందించారని పేర్కొన్నారు. అనంతరం సింగరేణి సూపర్ బజార్ ఉద్యోగులు మాట్లాడుతూ జితేందర్ రెడ్డి బెల్లంపల్లి ఇల్లెందు కొత్తగూడెం ఏరియాలలో పనిచేసి మంచి పేరు సంపాదించుకున్నారని తెలిపారు. మూడు ఏరియాలలో దాదాపు 34 సంవత్సరాలుగా విధులు నిర్వర్తించిన జితేందర్ రెడ్డి సంపూర్ణ ఆరోగ్యంతో ఉండడంతో పాటు కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. తరువాత జితేందర్ రెడ్డి స్వప్న దంపతులను సింగరేణి సూపర్ బజార్, హెచ్.పీ గ్యాస్ సిబ్బంది ఘనంగా సన్మానించి జితేందర్ రెడ్డి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సూపర్ బజార్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, ఏ.పాండురంగారెడ్డి, తిరుపతి రెడ్డి దంపతులు, అన్వర్ తోపాటు సింగరేణి హెచ్.పీ గ్యాస్ సూపర్ బజార్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




# అటీజం నివారణకు నూతన పరిశోధనలు

## సంగారెడ్డి కలెక్టర్ ప్రతీక్ జైన్ కి మెమోరన

మహబూబ్నగర్ ( నేషనలిస్ట్ వాయిస్ జిల్లా రిపోర్టర్ ) మే 1

రిస్ ప్లేస్ ఆటిజం రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ తోడుపునూరి, డాక్టర్ కళా రమ్య డైరెక్టర్ గత నాలుగు నుంచి అయిదు దశబ్దాల కాలం లో ఆందోళనకరంగా పెరుగుతున్న ఆటీజం కేసులు ప్రస్తుతం ఇప్పుడు పుట్టే ప్రతి 50 మంది పిల్లలలో ఒకరు ఆటీజం తో బాధపడుతున్నారు. రానున్న రెండు దశాబ్దాలలో పుట్టే ప్రతి పదిమంది పిల్లల్లో ఒకరికి ఆటీజం వస్తుందని ఒక అంచనా ఉంది దీనిని దృష్టిలో పెట్టుకుని రిస్ ప్లేస్ ఆటిజం రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి పర్యావరణం మరియు గట్ ఆరోగ్యాన్ని సరి చేస్తే ఆటిజన్ని సమర్ధవంతంగా నియంత్రించవచ్చు, అమెరికా ప్రభుత్వ పర్యావరణ పరిరక్షణ సంస్థ (ఇ.పి. ఏ) 2005 లో నిర్వహించిన నవజాత శిశువుపై జరిగిన " బాడీ బడెన్ స్టడీ " నీ మరియు 2025 లో విడుదలైన రెండు దశాబ్దాల పరిశోధనలు " మేక్ అమెరికా హెల్తీ అగైన్ "(మహా) గెజిట్ నివేదికను ప్రాస్తవించారు. ఈ పరిశోధనల ప్రకారం వ్యవసాయంలో వాడే రసాయనాలు పరిశ్రమల నుంచి మంచినీటిలో కలిగే కాలుష్యాలు నాన్ స్టిక్ వంట పాత్రల నుంచి విడుదల అయ్యే పదార్థాలు ఆహార పరిరక్షణ వంటి రసాయనాలు శరీరంలో క్రమంగా చేరి ( బయో అక్యుమిలేషన్ ) గర్భస్థ శిశువుల నాడి వ్యవస్థ అభివృద్ధికి ప్రభావితం చేస్తుందని రిస్ ప్లేస్ ఆటిజం రీసర్చ్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్ తొడుపునూరి నిర్ధారించారు. ఇలాంటి రసాయనాలు శిశువు గట్ మైక్రో భాయోమ్ అభివృద్ధిని భంగ పరుస్తుంది మరియు మెదడు అభివృద్ధి రోగ నిరోధక వ్యవస్థ నాడి ఆరోగ్యానికి కీలకం పర్యావరణ విషతుల్యత మరియు గట్ ఆరోగ్యం నాడీ అభివృద్ధిని సమస్యలను కీలక పాత్ర పోషిస్తున్నాయి. ప్రారంభ దశలోనే రసాయనాల ప్రభావం తగ్గించి మైక్రో బయోమ్ ఆరోగ్యాన్ని మెరుగుపరిస్తే భవిష్యత్ తరానికి ఆటిజం ప్రబల్యాన్ని తగ్గించవచ్చు. ప్రభుత్వ సంస్థలు మరియు నియంత్రణ సంస్థలు పర్యావరణ కాలుష్యాన్ని తగ్గించే విధానాలపై దృష్టి పెట్టాలి ఆహారం మరియు నీటి భద్రత బలోపేతం చేయాలి. అటిస్టిక్ సమస్యలను ఎదుర్కొంటున్న చిన్నారులలో గట్ బ్రెయిన్ యాక్సిస్ ను పరిరక్షించే ఫికెల్ మైక్రో బయట ట్రాన్స్ ప్లాంటేషన్ (ఎఫ్ టీ ఎం ) తెరపి భారతదేశంలోని మొట్టమొదటిసారిగా చికిత్స అందిస్తున్న ఏకైక సంస్థ రిస్ ప్లేస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్. దేశంలో తొలి స్టూల్ బ్యాంకు ను ఏర్పాటు చేశారు. రిస్ ప్లేస్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ డాక్టర్ చంద్రశేఖర్, తొడుపునూరి. మలబద్ధకం ఉబ్బరం ఆహారం జీర్ణం కాని సమస్యలు అనేక అటిస్టిక్ పిల్లలలో కనిపిస్తాయి గట్ లోని బ్యాక్టీరియా మెదడుకు సాంకేతాలు పంపడం ద్వారా నిద్ర అభ్యాసం ప్రవర్తనకై ప్రభావం చూపుతుందని శాస్త్రవేత్తలు



నిర్ధారించారు దీనికి పరిష్కారం ఫికల్ మైక్రో బయట ట్రాన్స్పాటేషన్ (ఎఫ్ టీ ఎం ) చికిత్సను అభివృద్ధి చేసింది రీస్ ప్లేస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఎఫ్ ఎం టీ,చికిత్స ఆటిజం లక్షణాలలో 30% నుంచి 40% మెరుగుదలలను ఇస్తుందినిర్దిష్ట మెదడు ప్రాంతాలకు సిగ్నలింగ్ అణువును లక్ష్యంగా చేసుకుని అందించడం పరిశోధనలో ఉంది, ఇది 70% నుంచి 80% రికవరీని ఇస్తుందని భావిస్తున్నారు. ఈ పరిశోధన ఇప్పటి నుండి ఒక దశాబ్దం పడుతుంది. అటీజం రీసెర్చ్ లో అటీజం గల చికిత్స,కారణాలు మరియు నివారణ మార్గాలు జనాలకి అందుబాటులో లేవు గర్భధారణకు ముందే ఆటిజాన్ని అరికట్టవచ్చు అనే విషయం మన దేశం మొత్తం మరియు రెండు తెలుగు రాష్ట్రాల ప్రతి గ్రామ గ్రామాలలో విషయం చేరాలన్న ఉద్దేశంతో రిస్ ప్లస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ రాష్ట్ర ప్రభుత్వ మరియు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఆటిజం నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి మరియు అవగాహన కల్పించాలనీ రిస్ ప్లేస్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ పి.లాలూ ప్రసాద్. సంగారెడ్డి కలెక్టర్ ప్రతిక్ జైన్ . కి కలిసి మెమొరండం ఇచ్చారు.

# కొంగోడు గ్రామంలో మత్స్యశాఖ ఎన్నికలు ఏకగ్రీవం

## -చైర్మన్ గంపల పరశురాం-వైస్ చైర్మన్ గోపాల్

మెదక్ జిల్లా బ్యూరో / నేషనలిస్ట్ వాయిస్ / మే 1

మెదక్ జిల్లా కొల్చారం మండలం కొంగోడు గ్రామంలో మత్స్యశాఖ సంఘ ఎన్నికలు శాంతియుత వాతావరణంలో ఏకగ్రీవంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో గ్రామానికి చెందిన గంపల పరశురాం గారిని మత్స్యశాఖ చైర్మన్గా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అలాగే సంఘం వైస్ ప్రెసిడెంట్ మరియు కార్యదర్శిగా కొత్త గోపాల్ గారిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, సభ్యులు నూతనంగా ఎన్నికైన ప్రతినిధులకు అభినందనలు తెలిపారుమత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం సమిష్టిగా కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో మత్స్య రంగాన్ని మరింత అభివృద్ధి పరచడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని వారు





# సి పి ఐ ఆధ్వర్యంలో దామరచర్ల లో ఘనంగా మేడే దినోత్సవం..

## ప్రధాని మోడీ కార్మిక వ్యతిరేక చట్టాలను రద్దు చేసే వరకు పోరాడాలి... సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు.





నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి మే 1.

నాడు చికాగో నగరంలో హే మార్కెట్లో జరిగిన నిరసన పోరాటంలో కార్మికులపై జరిగిన పోరాటంలో అమరులైన సాక్షిగా నేడు మనం జరుపుకుంటున్న మేడే దినోత్సవం అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ అన్నారు. మేడే దినోత్సవం సందర్భంగా దామరచర్ల మండల కేంద్రంలో సంఘటిత అసంఘటిత కార్మికుల సమక్షంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై దామరచర్ల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో ఎర్రజెండాను ఎగురవేశారు. అనంతరం వారు మాట్లాడుతూ 140 సంవత్సరాల క్రితం వెట్టి చాకిరి విముక్తి కోసం కార్మికుల తో 18 గంటల పని దినాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం ఆధారంగా నేడు యావత్ ప్రపంచం కార్మికుల దినోత్సవం జరుపుకుంటుందని గుర్తు చేశారు. అమరుల త్యాగాల సాక్షిగా ఎనిమిది గంటల పని దినం సాధించుకున్న కార్మికులకు వ్యతిరేకంగా నేడు ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం మళ్లీ 12 గంటలు పని దినం కోసం కార్మిక వ్యతిరేక నాలుగు నల్ల చట్టాలను తేవడం కోసం బిల్లులను అమలు చేసేందుకు మోడీ కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. రైతు వ్యతిరేక చట్టాలను కార్మిక వ్యతిరేక చట్టాలను తెచ్చి ప్రజలపై పని భారాన్ని పెంచి కార్పొరేట్ పెట్టకూడదారులకు మోడీ ప్రభుత్వం కొమ్ముకాస్తున్నారని ధ్వజమెత్తారు. ఏది ఏమైనా బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు కార్మిక లోకమంతా కదలిరావాలని ఈ చట్టాలను పూర్తిస్థాయిలో నిలిపివేసే వరకు ఐక్యంగా పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ దామరచర్ల కార్యదర్శి పోలేపల్లి ఉదయ్ కుమార్ సహాయ కార్యదర్శి ధనావత్ శాంత సీనియర్ సిపిఐ నాయకులు జమ్ముల కోటయ్య పేరుపొంగు లక్ష్మయ్య సైదులు శివ తుపాకుల కళ్యాణ్ వెంకటేష్ రమేష్ హుస్సేనమ్మ వెంకన్న వినయ్ ప్రభు కిరణ్ ధరన్ తదితరులు పాల్గొన్నారు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు - అన్నదాతల అవగాహన కార్యక్రమం...

దామరచర్ల నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి మే 1.

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం, సంయుక్త ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమం కొండ్రపోల్ గ్రామం , దామరచర్ల మండలం లో నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్. వి శ్రీధర్ గారు మాట్లాడుతూ రైతులు యూరియా వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. మార్కెట్లో డిమాండ్ లో ఉన్న వరి పంట రకాలు మరియు వ్యవసాయ వర్సిటీ వరి రకాల సాగు గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఉద్యాన శాస్త్రవేత్తలు టి. హిమబిందు రైతులు పంటమార్పిడి ఆవశ్యకత గురించి రైతులకు వివరించారు. సేంద్రీయ వ్యవసాయ పద్ధతుల గురించి, పంట వైవిధ్యాకరణ పండ్లు కూరగాయలు సాగు నీటి ఆదా పద్ధతుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. మిర్యాలగూడ ఉద్యాన అధికారి షేక్. నసీమ గారు ఉద్యాన శాఖ రైతులకు అందిస్తున్న సబ్సిడీలు, పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి బాలకృష్ణ ఏ ఈ ఓ సైదులు వ్యవసాయ శాఖ పథకాల గురించి రైతులకు అవగాహన కల్పించారు. కొండ్రపోల్ సర్పంచ్ శ్రీమతి రాధా రామలింగం మరియు సైదులు దిలావర్పూర్ సర్పంచ్ లు మాట్లాడుతూ శాస్త్రవేత్తల అవగాహన కార్యక్రమం రైతులకు ఎంతగానో ఉపయోగపడిందని రైతులు సేంద్రీయ వ్యవసాయ అవలంబించాలని సూచించారు. కార్యక్రమంలో ఎం ఎ ఓ దామరచర్ల, మిర్యాలగూడ క్లస్టర్ , సైదులు, మట్టా రెడ్డి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, శాస్త్రవేత్తలు డాక్టర్ శ్రీధర్, టి హిమబిందు ఆదర్శ రైతు లు కొడాలి ప్రభాకర్, రమణ మరియు మొత్తం 85 మంది రైతులు పాల్గొన్నారు.



# కార్మికుల దినోత్సవం రోజునే నోచ్ ఫార్మా ప్రమాద ఘటనలో కార్మికులు గాయపడటం అత్యంత బాధాకరం - దైద రవీందర్.





నేషనలిస్ట్ వాయిస్ ప్రతి నిధి మే 1.

పిట్లంపల్లి శివారులోనే నోచు ఫార్మా లో పరిశ్రమలో నిర్లక్ష్య వైఖరి వల్లనే మేడే రోజున ప్రమాదం జరగడం అత్యంత బాధాకరమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ వాపోయారు. మేడే దినోత్సవం న నల్గొండ జిల్లా చిట్యాల మండలం పిట్టంపల్లి శివారు లోని నోచ్ ఫార్మా లో రియాక్టర్ పేలిన ఘటన లో 9 మంది కార్మికులు గాయపడ్డారని దైద రవీందర్ వాపోయారు. ఈ ప్రమాదంలో గాయపడ్డ వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని అన్నారు. ఈ ఘటన తెలిసిన వెంటనే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దైద రవీందర్ ఘటనాస్థలికి వెళ్లి కంపెనీ మొత్తం సందర్శించి ప్రమాద వివరాలు పరిశ్రమ యజమానులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కుల కోసం పోరాడే రోజు మేడే రోజునే ఈ ప్రమాదం జరగటం అత్యంత బాధాకరం అని ప్రమాద లో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. మళ్లీ ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ఫార్మా కంపెనీలు చర్యలు తీసుకోవాలని మేడే రోజు సెలవు ఇవ్వకుండా కార్మికుల చేత పని చేయించుకోవడం ఎందని ప్రశ్నించారు. ఆయన వెంట సీనియర్ కాంగ్రెస్ నాయకులు చీమల వీరేశం యాదవ్ , క్రిష్ణయ్య , మామిడి వీరస్వామి శ్రీను , బోయపల్లి వెంకన్న సతీష్ తదితరులు పాల్గొన్నారు

# మే 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్ - 1861 అమలు

## జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు

మెదక్ జిల్లా బ్యూరో నేషనలిస్ట్ వాయిస్ మే 01

ఈ సమయంలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఏవిధమైన ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని జిల్లా ఎస్పీ తెలిపారు. అలాగే ప్రజల/ ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక చర్యలు, అశాంతి సృష్టించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల నిర్వహణలో ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులు చేపడుతున్న చర్యలకు సహకరిం చాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.



# తెలంగాణలో భానుడు భగ్గుమంటున్నాడు

చేగుంట మే 01(నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ )

లిరాష్ట్ర వ్యాప్తంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవాళ నిజామాబాద్, జగిత్యాల, కామారెడ్డి, మంచిర్యాల, నిర్మల్, పెద్దపల్లి, నల్లగొండ, ఆదిలాబాద్, భద్రాద్రి, కొమురంభీంలలో 44 డిగ్రీలు, సిద్దిపేట, మెదక్, నారాయణపేట, నాగర్ కర్నూలు, సూర్యాపేట, ములుగు, కరీంనగర్ జిల్లాల్లో 43 డిగ్రీలు, ఖమ్మం, భూపాలపల్లి, హనుమకొండ, గద్వాల, సిరిసిల్ల, మహబూబాబాద్, మహబూబ్నగర్, వరంగల్లో 43 డిగ్రీలు, రంగారెడ్డి, వనపర్తి, యాదాద్రి, మేడ్చల్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే ఏపీలోనూ 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మర్కాపురం, నంద్యాలలో అత్యధికంగా 44 డిగ్రీలు, కడప, కర్నూలు, పల్నాడు జిల్లాల్లో 43 డిగ్రీలు, అనంతపురం, నెల్లూరు జిల్లాల్లో 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.బి

# అమాలి సంఘం ఆధ్వర్యంలో కార్మిక మే డే వేడుకలు

**చేగుంట మే 01 ( నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్ )**

చేగుంట మండల కేంద్రంలోని అమాలి సంఘం ఆవరణలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు, కార్మిక దినోత్సవం పురస్కరించుకొని జెండా ఎగరవేశారు ఈ సందర్భంగా కార్మిక సంఘం అధ్యక్షుడు దుర్గి నర్సింలు,సోమ వెంకటేష్, సిరిగోజి సత్యనారాయణ, మాట్లాడుతూ 1986లో చికాగో లో 18 గంటల పనిని ఎనిమిది గంటలకు కుదిస్తూ మే ఒకటో తేదీన అమలు చేయడం జరిగిందని దానిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం మే 1వ తేదీని కార్మిక దినోత్సవం గా పిలుస్తూ వేడుకలు జరుపుకోవడం జరుగుతుంది అని తెలిపారు, కార్మిక దినోత్సవ వేడుకలు దేశవ్యాప్తంగా జరుపుకోవడం జరుగుతుందని వారు అన్నారు, ఈ కార్యక్రమంలో అధ్యక్షులు దుర్గి నర్సింలు,ఉపాధ్యక్షులు దుర్గి శివరాజ్,ప్రధాన కార్యదర్శి సోమ పెద్ద వెంకటేష్, క్యాషియర్ మెట్టు రవి,కర్ణ లక్ష్మణ్ , ఆర్గానిక్ సెక్రెటరీ సోమషోక్ సలహాదారులు బక్క చిన్న నర్సింలు, తలారి నల్ల పోచయ్య, సిరిగోజి సత్యనారాయణ,మెట్టు భూపాల్, నాగులు, షాదుల్లా,పులబోయిన భూపాల్, మరియు సంఘ సభ్యులు





# నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలి

**-జిల్లాలో మొత్తం 479మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు -అభ్యర్థులు హాల్ టికెట్ లోని సూచనలను పక్కాగా పాటించాలి**

**-సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలి.-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ జిల్లా బ్యూరో / నేషనలిస్ట్ వాయిస్ / మే 01**

నీట్ పరీక్షను ఎలాంటి చిన్న తప్పిదం కూడా లేకుండా జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 3వ తేదీన నిర్వహించనున్న నీట్ పరీక్షకు సంబంధించి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 479మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలో నీట్ నిర్వహించే ఒక పరీక్ష కేంద్రంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని, గతేడాది మాదిరే పరీక్షలను సజావుగా నిర్వహించాలన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్ లోనీ నిబంధనలను పూర్తిగా అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా పరీక్ష రాసేందుకు రావాలని సూచించారు. ఆయా కేంద్రాల్లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బందికి విధిగా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. పరీక్షా కేంద్రంలో సిఎస్, అబ్జర్వర్లు, ఇతర సిబ్బందితోపాటు తహసిల్దార్ స్థాయి అధికారులు, ఎస్సై, ఒక గన్మెన్, నలుగురు కానిస్టేబుల్స్ తో కూడిన పోలీసులు విధులు నిర్వహించాలన్నారు. ఆయా కేంద్రాల వద్ద163 బి.ఎన్.ఎస్ సెక్షన్ అమలు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఉండాలన్నారు. .పరీక్ష కేంద్రం వద్ద విద్యుత్ సౌకర్యం, సీసీ కెమెరాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, తదితర అన్ని ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకునేందుకు ఆర్టీసీ తరఫున సకాలంలో బస్సులను నడపాలన్నారు. దివ్యాంగ అభ్యర్థులకై అవసరమైన ఏర్పాట్లు చేయాలని, ప్రాథమిక వైద్యం, అంబులెన్స్, ఫైర్ వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. ఎంతో ప్రాధాన్యతతో కూడిన నీట్ పరీక్షను ప్రశాంత వాతావరణంలో సజావుగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తుందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు. నీట్ పరీక్ష రాసే అభ్యర్థులకు సూచనలు సలహాలు అందించారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులు, చేతి గడియారాలు, బ్లూటూత్ పరికరాలు, బ్యాగులు, కాలిక్యులేటర్లు పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడవు.పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుంచి 5:.00 గంటల వరకు ఉంటుంది.పరీక్ష రాసే అభ్యర్థులను ఉదయం 11 గంటల నుండి పరీక్షా కేంద్రంలోకి అనువదించడం జరుగుతుంది అభ్యర్థులు మధ్యాహ్నం 1:30 గంటలలోపు పరీక్షా కేంద్రానికి చేరుకోవాలి.ఫోటో ఐడి ప్రూఫ్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో తప్పనిసరిగా వెంట తీసుకువెళ్ళాలి.మడమలు తక్కువగా ఉన్న చెప్పులు ధరించాలి. షూస్ ధరించకూడదు.మెడలో గొలుసులు,



ఉంగరాలు, చెవి కమ్మలు, ముక్కు పుడకలు వంటి లోహ ఆభరణాలు ధరించకూడదు.మధ్యాహ్నం 1:30 తర్వాత లోనికి అనుమతించరు. అడ్మిట్ కార్డు (ూాఎఊ ఝతీస), ఫోటో ఐడి ప్రూఫ్, పాస్‌పోర్ట్ సైజు ఫోటో తప్పనిసరిగా వెంట తీసుకువెళ్ళాలి.అని సూచించారు.

## డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, మహబూబ్ నగర్ మే 1, కార్మిక దినోత్సవం

**మహబూబ్ నగర్ (నేషనలిస్ట్ వాయిస్ జిల్లా రిపోర్టర్ ) మే 1**

,జిల్లా న్యాయ సేవా సంస్థ డి ఇందిరా ఆధ్వర్యంలో, అర్ టీ సి,ప్రాంగణంలో మొబైల్ వాన్ ద్వారా అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో కార్మికుల హక్కులు, ఉచిత న్యాయ సహాయం, కార్మిక చట్టాలు మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరంగా తెలియజేయబడింది. ముఖ్యంగా అసంఘటిత రంగ కార్మికులు తమ హక్కులను తెలుసుకుని, అవసరమైనప్పుడు న్యాయ సేవలను పొందాలని సూచించారు. ప్రతి కార్మికుడు తన హక్కులను తెలుసుకోవడం ఎంతో ముఖ్యమని, ఏదైనా సమస్యలు ఎదురైనప్పుడు జిల్లా న్యాయ సేవా సంస్థను సంప్రదించాలని సూచించారు.ఈ అవగాహన కార్యక్రమంలో పలువురు అధికారులు, సిబ్బంది మరియు కార్మికులు పాల్గొన్నారు.




## బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడమే పోలీస్ శాఖ మొదటి ప్రాధాన్యత జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

**మహబూబ్నగర్( నేషనలిస్ట్ వాయిస్ జిల్లా రిపోర్టర్ ) మే 1**

ప్రజల ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి వారికి భరోసా కల్పించడమే లక్ష్యంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో "ప్రజావాణి" కార్యక్రమం నిర్వహించబడుతుంది. బాధితులు తమ సమస్యల కోసం ఎప్పుడైనా ఎస్పీ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ బాధితులకు అండగా ఉంటుందని తెలిపినారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా, ఐపీఎస్, స్వయంగా ఫిర్యాదుదారులను కలిసి వారి ఇబ్బందులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన బాధితుల సమస్యలపై స్పందించిన ఎస్పీ అక్కడికక్కడే సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లకు (ఎస్ . హెచ్ .ఓ ) ఫోన్ చేసి కేసుల పురోగతిపై ఆరా తీశారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా, పూర్తి పారదర్శకతతో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సమాజంలో వృద్ధుల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. తల్లిదండ్రులను వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేసినా లేదా వారిని మానసిక, శారీరక ఇబ్బందులకు గురిచేసినా అటువంటి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఇట్టి విషయం పైన పలు ఫిర్యాదులు అందినాయి అని, ప్రజావాణికి వచ్చిన ప్రతి అర్జీని కంప్యూటరైజ్ చేసి, ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు నిరంతరం పర్యవేక్షించేలా ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఆమె వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.



# చేగుంట గ్రామపంచాయతీ ఆవరణలో మే డే వేడుకలు

**చేగుంట మే 01( నేషనలిస్ట్ వాయిస్ రిపోర్టర్)**

చేగుంట మండల కేంద్రంలోని స్థానిక గ్రామపంచాయతీ ఆవరణలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు, కార్మిక దినోత్సవం పురస్కరించుకొని జెండా ఎగరవేశారు ఈ సందర్భంగా సర్పంచ్ స్రవంతి సతీష్ ఉపసర్పంచ్ కార్మిక సంఘం అధ్యక్షుడు తలారి లింగం, మాట్లాడుతూ 1986లో చికాగో లో 18 గంటల పనిని ఎనిమిది గంటలకు కుదిస్తూ మే ఒకటో తేదీన అమలు చేయడం జరిగిందని దానిని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం మే 1వ తేదీని కార్మిక దినోత్సవం గా పిలుస్తూ వేడుకలు జరుపుకోవడం జరుగుతుంది అని తెలిపారు, కార్మికుల కు కనీస వేతనం ఇవ్వాలని కార్మిక దినోత్సవ వేడుకలు దేశవ్యాప్తంగా జరుపుకోవడం జరుగుతుందని వారు అన్నారు, కార్మికులకు పనికి తగ్గ వేతనం అందివాలని కార్మిక సంఘం నాయకుడు తలారి లింగం,ప్రభుత్వాన్ని కోరారు, ఈ కార్యక్రమంలో చేగుంట సర్పంచ్ సంద్రుగు స్రవంతి సతీష్, ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీ, వార్డు సభ్యులు పంచాయతీ కార్మికులు, సంఘం అధ్యక్షులు తలారి లింగం, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, కార్మికులు రాములు, బుదయ, శివమ్మ, లలిత, సాయమ్మ, మనమ్మ,లక్ష్మి, వెంకటేష్, సదుల్లా, కృష్ణ, సువర్ణ, నవీన్, నందు, శ్రీకాంత్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.





## మే డే శుభాకాంక్షలు తెలియజేసిన జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్

**మహబూబ్ నగర్ (నేషనలిస్ట్ వాయిస్ జిల్లా రిపోర్టర్ )మే 1**


సమాజ పురోగతికి తోడుపడేది కార్మికుడి శ్రమ మాత్రమే. ఆకాశమంత ఎత్తున నిర్మించిన కట్టడాలైనా దేశ ఆర్థిక వ్యవస్థను నడిపించే చక్రాలైనా వాటన్నింటి వెనుక ఉన్నది కార్మికుల అలుపెరుగని శ్రమ నిరంతర త్యాగం హక్కుల కోసం జరిగిన పోరాట స్ఫూర్తిని స్మరించుకుంటూ శ్రమజీవుల గౌరవాన్ని చాటిచెప్పే ఈ 'మే డే' సందర్భంగా జడ్చర్ల నియోజకవర్గంలోని కార్మిక సోదర సోదరీమణులందరికీ శు భాకాంక్షలు తెలియజేసిన జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్



# ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవంలో కాంగ్రెస్ నాయకులు

**(కుల్కచర్ల : నేషనలిస్ట్ వాయిస్ : మే : 2)**

కుల్కచర్ల గ్రామానికి చెందిన జోగు అనూష కుమార్ కు మంజూరైన ఇందిరమ్మ ఇల్లును కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేసేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా గ్రామాభివృద్ధికి అందరు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసి ఉపాధ్యక్షులు బొల్సని భీమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బి ఎస్ ఆంజనేయులు ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్,పరిగి బ్లాక్ బి అధ్యక్షులు భరత్ కుమార్, మండల పార్టీ మాజీ అధ్యక్షులు పెంట మీద వెంకటయ్య గౌడ్, వార్డు మెంబర్ మోత్కూరు వెంకటేష్, నాయకులు చెర్ల నరసింహులు, భాను, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి కార్మిక సోదరులకు మే డే శుభాకాంక్షలు తెలిపిన డీసీసీ సంజీవ్ ముదిరాజ్

**మహబూబ్నగర్ ( నేషనలిస్ట్ వాయిస్ జిల్లా రిపోర్టర్ ) మే 1**

మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో ఐఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో ఐఎన్‌టీయూసీ మరియు ఏఐటీయూసీ జెండాలను ఆవిష్కరించిన మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అనంతరం డీసీసీ మాట్లాడుతూ, కార్మికుల హక్కుల సాధనలో సంఘాల పాత్ర ఎంతో ముఖ్యమని, కార్మికుల సంక్షేమం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి ,జిల్లా ఐఎన్‌టీయూసీ అధ్యక్షులు రాములు యాదవ్ ,ఐఎన్‌టీయూసీ కార్యదర్శి రామోహన్ ,డీసీసీ ఉపాధ్యక్షులు బెక్కరి మధుసూదన్ రెడ్డి ,ఏఐటీయూసీ అధ్యక్షులు రంగన్న ,ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు సురేష్ ,కాంగ్రెస్ నాయకులు హర్ష వర్ధన్ రెడ్డి, గోనెల శ్రీనివాస్, చందు యాదవ్, గోపాల్ యాదవ్, రియాజుద్దీన్ తదితరులు అలాగే ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ నాయకులు మరియు పెద్దలు పాల్గొన్నారు.





# ఉపాధి కార్మికుల గొంతు నొక్కుతున్న కేంద్రం

- విబి గ్రామ్ జీ బిల్లు రాజ్యాంగ వ్యతిరేక చట్టమే!.
- ఎన్ ఎమ్ ఎమ్ ఎస్ ను రద్దు చేయాలి!.
- ఉపాధి హామీ హక్కుల పరిరక్షణ యాత్ర ప్రారంభం!.
- చుంచు రాజేందర్ డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు!.

ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 01 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)




ఉపాధి హామీ కూలీ కార్మికులైన హక్కుదారుల గొంతును అడుగడుగున నొక్కి వేస్తూ, ఇరవై ఏండ్ల ఉపాధి చట్టాన్ని రద్దు చేసి నూతనంగా కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విబి గ్రామ్ జీ బిల్లు 2025ను ఏకపక్షంగా అమలు చేయడం సరైంది కాదని అన్నారు. ఈ చట్టం పూర్తిగా భారత దేశ రాజ్యాంగానికి వ్యతిరేకంగా రూపకల్పన చేసిన చట్టమేనని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆత్మకూరు మండలం అక్కంపేట గ్రామంలో చెరువు పూడికతీత పనులు చేస్తున్న కూలీలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రపంచ కార్మికుల దినోత్సవం మే డే సందర్భంగా డిబిఎఫ్ ఆద్వర్యంలో మే డే నుండి జూన్ పదహారు జాతీయ గృహ కార్మికుల దినోత్సవం వరకు నిర్వహించే ఉపాధి హామీ హక్కుల పరిరక్షణ యాత్రను ప్రారంభించారు.
ఈ సందర్భంగా డిబిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చుంచు రాజేందర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ కార్మికులకు ఎనిమిది గంటల పని విధానాన్ని, కనీస వేతనాలను చట్ట బద్ధంగా అమలు చేశారని అన్నారు.
పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కొడ్ బిల్లులను తీసుకువచ్చి కార్మికుల గొంతు నొక్కుతుందన్నారు. కేంద్రంలో బిజెపి అధికారం లోకి వచ్చిన నాటినుండి నేటి వరకు ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తూ, కూలీల హక్కులను కాల రాస్తుందన్నారు. పాత పద్దతిలో ఉపాధి హామీ పనిని కొనసాగించాలని, నూతనంగా అమలైన విబి గ్రామ్ జీ చట్టాన్ని కూలీలు సంఘటితమై ఉద్యమించి తిరస్కరించాలన్నారు.
రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ కూలీల పక్షాన నిలబడి విబి గ్రామ్ జీ బిల్లును రద్దు చేసే విధంగా గొంతెత్తి కేంద్ర ప్రభుత్వ మెడలు వంచాలన్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో నూతన ఉపాధి హామీ చట్టాన్ని రూపొందించాలన్నారు.
ఉపాధి కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్న పోటో అప్ లోడ్ విధానమైన నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ ను రద్దు చేయాలన్నారు. కూలీలు గత మూడు నెలలుగా పని చేసిన పెండింగ్ వేతనాలను విడుదల చేయడం హర్షించ దగిన విషయమన్నారు.
ఎండలు మండుతున్నందున పనులవద్ద కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. రాష్ట్ర గ్రామీణ అభివృద్ధి శాఖ కమీషనర్ దివ్య దేవారాజన్ 14 వ ఫైనాన్స్ కమీషన్ సంబంధించి కూలీలకు పనుల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలని, ఓ ఆర్ ఎస్ ప్యాకెట్స్, మజ్జిగ, మంచినీరు అందించాలని గ్రామ పంచాయతి సర్పంచ్, కార్యదర్శులకు సర్క్యూలర్ జారి చేశారని దానిని అమలు చేయాల్సిన బాధ్యత గ్రామ పంచాయితిలదని అన్నారు. ఆర్థిక సంవత్సరంలో కూలీలకు 100 రోజుల పాటు పనిని ఇవ్వని కేంద్రం 125 రోజుల పనిని కల్పిస్తా మనడం విడ్డూరమేనన్నారు.
బిజెపి సర్కారు కూలీల గొంతు నొక్కేందుకే కొత్త కొత్త విధానాలను తీసుకు వస్తుందని వాపోయారు.

## మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు
## కార్మిక హక్కుల పరిరక్షణకు సీపీఎం పిలుపు

దోమ నేషనలిస్ట్ వాయిస్ ప్రతినిధి మే 1



140వ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా దోమ మండలంలోని తిమ్మాయిపల్లి, దిర్సంపల్లి గ్రామాల్లో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా గ్రామాల్లో సీపీఎం జెండాలు ఎగురవేసి కార్మిక దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం. వెంకటయ్య, ఎహ్. సత్యయ్య, మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ మే డే ప్రపంచ కార్మిక వర్గ పోరాటాల ప్రతీక అని తెలిపారు. 1886లో అమెరికాలోని చికాగోలో 8 గంటల పని దినం కోసం కార్మికులు చేసిన చారిత్రాత్మక పోరాట ఫలితంగానే మే 1ను అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా జరుపుకుంటున్నామని పేర్కొన్నారు. కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చడం ద్వారా కార్మికుల హక్కులను బలహీనపరుస్తోందని విమర్శించారు. మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడం వల్ల గ్రామీణ పేదల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న నూతన విద్యుత్ చట్టం, విత్తన చట్టాలు రైతులకు, ప్రజలకు నష్టాన్ని కలిగించేలా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై కూడా విమర్శలు చేస్తూ కార్మికులు, కూలీలు, పేద ప్రజల సమస్యలను పట్టించుకోవడంలో విఫలమవుతోందని ఆరోపించారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, కార్మిక సమస్యలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల ఐక్యతతోనే హక్కులు సాధ్యమవుతాయని, మే డే స్ఫూర్తితో అన్ని వర్గాల కార్మికులు సంఘటితంగా పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో దిర్సంపల్లి సర్పంచ్ వెంకట్రాములు, ఉప సర్పంచ్, వార్డ్ సభ్యులు, పార్టీ నాయకులు రఘురామ్, సత్యయ్య, మొగులయ్య, చెన్నారెడ్డి, మోహన్, శేఖర్, శ్రీనివాస్, అరుణ్, నర్సింహా, లాలయ్య, వెంకటేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## ఏఐటియూసి ఆధ్వర్యంలో పెంటపాడులో ఘనంగా మే డే

తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 1 (నేషనలిస్ట్ వాయిస్ )

పెంటపాడు మండల కేంద్రంలో ప్రాంతీయ పంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఏ ఐ టి యు సి అనుబంధం) ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకర్ దగ్గర ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఏఐటియుసి జెండాను బి లక్ష్మి శుక్రవారం ఆవిష్కరించారు. పెంటపాడు గేట్ సెంటర్లో ఏ ఐ టి యు సి జెండాను సిహెచ్ రాజు ఎగరవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం కార్యనిర్వహ అధ్యక్షులు కే లక్ష్మణరావు మాట్లాడుతూ కార్మికులు తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పని గంటల కోసం పోరాటం చేసి సాధించుకున్న హక్కులని తెలిపారు. 140 సంవత్సరాల చరిత్ర కలిగిన మేడే ఎంతో ప్రాధాన్యత కలిగిందన్నారు. ప్రస్తుత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక చట్టాలను, కార్మిక హక్కులను హరించే విధంగా నిర్ణయాలు తీసుకోవటం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. బ్రిటిష్ కాలం నుంచి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం తొలగించి నూతన కార్మిక చట్టాలను తీసుకొచ్చి కార్మికుల జీవన ప్రమాణ స్థాయిలను, వెట్టి చాకిరి మరియు బానిసలగా మార్చడానికి ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. మే డే స్ఫూర్తితో రానున్నకాలంలో కార్మిక హక్కుల కోసం, ఉద్యోగ భద్రత కోసం,కనీస వేతనం అమలు కోసం, ఔట్సోర్సింగ్ కాంటాక్ట్ ఉద్యోగులను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని, పనిగంటలు తగ్గించాలని తదితర సమస్యలపై సమరసిల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కోన రాజేష్, ఉప్పాటి సింహాచలం శ్రీనివాస్ అప్పారావు లక్ష్మి తదితరులు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. పెంటపాడు గేట్ సెంటర్లో సిపిఐ స్థూపం వద్ద సిపిఐ జెండాను సిపిఐ సీనియర్ నాయకులు వంక అప్పారావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కే లక్ష్మణరావు ఏపీ రైతు సంఘం నాయకులు బండారు శ్రీనివాసరావు కొనతల నాగరాజు కే రాజేష్ సిహెచ్ రాజు బి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.







# సి ఆర్ రెడ్డి కళాశాలలో ఎచివర్స్ డే 2026 ఘనంగా నిర్వహణ






ఏలూరు :మే 1( నేషనలిస్ట్ వాయిస్ )

స్థానిక సర్ సి ఆర్ రెడ్డి అటానమస్ కళాశాలలో "ఎచీవర్స్ డే 2026" ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.యమ్.వి.చక్రధరరావు అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి పారిశ్రామిక అవసరాలకు అను గుణంగా విద్యార్థులకు అన్నిరకముల నైపుణ్యాలను నేర్పించి విద్యపూర్తి అవగానే ఉద్యోగం పొందేలాగ తీర్చిదిద్దుతున్నాము అన్నారు. 2025-26 విద్యా సంవత్సరంలో 49 కంపెనీలకు సంబంధించి కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించగా 416మంది విద్యార్థులకు 1581 నియామక పత్రాలను సుమారు ఒక్కొక్క విద్యార్థికి రెండు మూడు కంపెనీలలో ఉద్యోగాలకు ఎంపికయ్యారని దీనిని పురస్కరించు కొని యాజమాన్యం వారు విద్యార్థులను వారి తల్లితండ్రులను అభినందించడానికి మరియు ప్రోత్సహించడానికి ఈ "ఎచీవర్స్ డే" కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశాము అన్నారు.
ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్ సి ఆర్ ఆర్ విద్యాసంస్థల అధ్యక్షులు డా. అల్లూరి ఇంద్ర కుమార్ గారు మాట్లాడుతూ ఆంధ్రాయూనివర్శిటీ మొదటి వైస్ ఛాన్సలర్ అయిన సర్ కట్టమంచి రామలింగారెడ్డి పేరు పెట్టడం ఒక చారిత్రాత్మకమైన అంశం అని, ఈ కళాశాలలో చదివిన పూర్వవిద్యార్థులు దేశ విదేశాలలో అత్యున్నతమైన స్థానంలో ఉన్నారని అన్నారు. మన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఏర్పాటుచేయబడిన మొదటి డిగ్రీకళాశాల సర్ సి ఆర్ రెడ్డి కళాశాల అని విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులను తయారు చేస్తూ వారి నైపుణ్యాలను పెంపొందించ డానికి 2005వ సంవత్సరంలో కళాశాలలో ప్లేస్మెంట్ సెల్ మరియు స్కిల్ డెవలెప్మెంట్ సెల్ ఏర్పాటు చేసి, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారి జవహర్ నాలెడ్జ్ సెంటర్ ద్వారా అనేక మంది విద్యార్థులకు శిక్షణ మరియు వివిధ పరిశ్రమలకు కావలసిన నైపుణ్యాలను అందచేస్తున్నామని తెలియచేశారు. ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలు పొందిన విద్యార్థులను వారి తల్లి తండ్రులను అభినంధించి సమాజాలో భాధ్యతా యుతంగా మెలగాలని తెలియచేశారు.
సర్ సి ఆర్ ఆర్ విద్యాసంస్థల కార్యదర్శి డా.యమ్.బి.ఎస్.వి.ప్రసాద్ గారు మాట్లాడుతూ నేను కూడా ఈ కళాశాల పూర్వవిద్యార్థిని అని పేద మధ్యతరగతి విద్యార్థులకు ఫీజులు అందుబాటులో ఉండడం వలన ఎక్కువ మంది విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉన్నత విద్యావంతులగా తీర్చిదిద్దాము అన్నారు అందుకు ఉదాహరణే ఈ "ఎచీవర్స్ డే".
సర్ సి ఆర్ ఆర్ విద్యాసంస్థల పాలకవర్గ జాయింట్ సెక్రటరీ శ్రీ వంకినేని భానుప్రకాష్ మాట్లాడుతూ ఉద్యోగాలు పొందిన విద్యార్థులు పనిచేసే సంస్థలలో అభివృద్ధిని సాధించి కళాశాలకు మంచిపేరు తీసుకురావలెనని, పోటీ ప్రపంచంలో విద్యార్థులు రాణించడానికి కళాశాలలో ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకోవాలని అన్నారు.
ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల జాయింట్ సెక్రటరీ వి శ్రీకృష్ణ, కోశాధికారి బి బి వి వి ప్రసాదరావు వివిధ కళాశాలల కరస్పాండెంట్స్ డా.కె.ఎస్. విష్ణుమోహన్, శ్రీ కలగర శివరామ కృష్ణ ప్రసాద్, కల్కి సత్య నారాయణ, వంకినేని రఘుకుమార్, సి ఆర్ ఆర్ విద్యాసంస్థల సి.ఈ.ఓ. డా. కిషన్ కాజా, విఠల్, వైస్ ప్రిన్సిపాల్స్ కె విశ్వేశ్వరరావు, ఎం రత్నాకర్, పి.జి కోర్సెస్ డైరెక్టర్ డా.వి.ఆర్.ఎస్.బాబు యలమర్తి, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు వారి తల్లితండ్రులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక సమావేశాలకు విస్తృత ఏర్పాట్లు

## - కలెక్టర్ చాహత్ బాజ్ పాయి






**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 01 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

హనుమకొండ, ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నేడు జిల్లాలో నియోజకవర్గ స్థాయి సమావేశాలను అట్టహాసంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములయ్యేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. శు క్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలు, నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణ, ధాన్యం సేకరణ, డివిజనల్ స్థాయిలో ప్రజావాణి నిర్వహణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ చాహత్ బాజ్ పాయి జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించి, పై అంశాల అమలుపై కీలక సూచనలు చేశారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను చివరి వరకు పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. గ్రామ, మండల స్థాయిలో నిర్వహించిన విధంగానే శనివారం జరిగే నియోజక వర్గ స్థాయి సభలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ఉదయం వేళ లోనే సభలు నిర్వహించాలని తెలిపారు. వరంగల్ పశ్చిమ నియోజక వర్గ స్థాయి సభను హన్మకొండ కలెక్టరేట్ లో , పరకాల నియోజకవర్గ సభను మహాదేవ ఫంక్షన్ హాల్ వేదికల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 4 నుండి 9 వరకు రైతు వారోత్సవాలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ సక్రమంగా సాగేందుకు క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులను ఆదేశించారు. ట్యాబ్ ఎంట్రీలు, రవాణా, గోనె సంచుల సరఫరా, హార్వెస్టర్ యంత్రాల వినియోగం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సకాలంలో ధాన్యం సేకరణ జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి దోహద పడుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీవోల ఆధ్వర్యంలో ప్రతి సోమవారం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని, తిరస్కరణ జరిగితే కారణాలతో దరఖాస్తు దారులకు సమాచారం అందించాలని తెలిపారు. దరఖాస్తుల వివరాలను పోర్టల్ లో నమోదు చేసి రసీదులు ఇవ్వాలని, దరఖాస్తుదారులు తమ దరఖాస్తు స్థితిని ఆన్‌లైన్‌లో తెలుసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు తాగునీరు, కూర్చునే సదుపాయం, అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని తెలిపారు.

ఈ నెల 3న జరగనున్న నీట్ ప్రవేశ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అభ్యర్థుల హాజరు బయోమెట్రిక్ విధానంలో నమోదు చేయాలని, పరీక్ష కేంద్రాలకు సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించ బోమని, కచ్చితమైన తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. జనగణన ప్రక్రియ లో భాగంగా ఈ నెల 10 వరకు నిర్వహించే స్వీయ గణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ స్వీయ నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని, అన్ని శాఖల అధికారులు తమతో పాటు సిబ్బందిని కూడా స్వీయ గణన చేయించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. టామ్‌టామ్, పత్రికలు, ఛానళ్ల ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. 33 ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వాలని, స్వీయ గణన అనంతరం వచ్చిన సంఖ్యను భద్ర పరచుకుని గణన అధికారులు ఇంటికి వచ్చినప్పుడు అందించాలని ప్రజలకు వివరించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ రవి, జిల్లా రెవెన్యూ అధికారి సత్యపాల్ రెడ్డి, జడ్పీ సీఈవో శేషాద్రి, డిఆర్డిఓ మేన శ్రీను, డి సి ఓ సంజీవరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కె.హరిత, ఎమ్మెల్సీ దండే విఠల్..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 01 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం సాండ్గాం గ్రామంలో వారి కొనుగోలు కేంద్రం ఐకెపి సెంటర్ ప్రారంభోత్సవం లో సిర్పూర్ శాసన సభ్యులు పాల్వాయి హరీష్ బాబు,కొమరం భీం జిల్లా కలెక్టర్ హరిత ,అడిషనల్ కలెక్టర్ డేవిడ్ ,కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్ల తో కలిసి పాల్గొన్న ఎమ్మెల్సీ దండే విఠల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ యాసంగి లో పండించిన వరి ధాన్యంరైతులు దళారులకు తక్కువ రేటుకు అమ్ముకోకుండా, ప్రభుత్వం మద్దతు ధరకు అమ్ముకోవాలని అన్నారు. ఈ కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాగజ్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్ధల దేవయ్య గారు డిసిఎంఎస్ వైస్ చైర్మన్ కొముురం మంతయ్య మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ సిడం గణపతి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు జానకి రామ్ చింతలమనేపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డుబ్బుల నానయ్య, డబ్బుల వెంకన్న,నాయకులు గట్టయ్య యాదవ్,శంకర్,తదితరులు పాల్గొన్నారు.





# కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 01 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

మే డే కార్మిక వర్గ భిక్షదినం తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ కార్మికులు సమ్మె చేసి కార్మికుల హక్కులు సాధించుకొని ఆర్టీసీని ప్రభుత్వ సంస్థగా విలీనం చేసుకోవడానికి కుదిరిన ఒప్పందంలో తెలంగాణ రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ చర్చల కృషి ఫలితం కార్మిక సంస్థ ఆర్టీసీ మనుగడ ప్రత్యేకత కల్పించినందుకు పొన్నం ప్రభాకర్ గౌడ్ కి మే డే సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినారు ఎల్కతుర్తి మండల మేడే ఉత్సవాల్లో భాగంగా శనిగరపు వెంకటేష్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు తెలిపినారు.



## ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిసిన తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్ వలవల మల్లిఖార్జునరావు


**తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 1 (నేషనలిస్ట్ వాయిస్ )**

మే డే కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని పామర్రు మండలం పమిడిముక్కల గ్రామానికి విచ్చేసిన గౌరవ ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుని తెదేపా నియోజకవర్గ ఇన్చార్జ్, భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు చైర్మన్ వలవల మల్లికార్జునరావు (బాబ్జి) శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజవర్గానికి సంబంధించి వివిధ సమస్యలపై చర్చించారు.

**పదో తరగతి విద్యార్థులకు సత్కారం**

పదో తరగతి పరీక్షలో పాసైనపలువురు విద్యార్థులను స్థానిక తెదేపా కార్యాలయంలో వలవల మల్లికార్జునరావు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆకాశపు స్వామి, గొర్రెల శ్రీధర్, కిలపర్తి వెంకట్రావు, దాసరి అప్పన్న,పద్మనాభుని మురళి, సబ్బివిసు కృష్ణమోహన్, పాతూరి రాంప్రసాద్ చౌదరి,ముప్పిడి రమేష్, దాట్ల జగన్నాథ రాజు, ముత్యాల శ్రీనివాస్, కాకర్ల సుభద్ర, అంబటి వాసు, మరియు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.





# ఇండియాలో ఫ్యూడల్ క్యాపిటలిజాన్ని నిర్మూలిద్దాం

- రాజ్యాంగన్ని లౌకిక ప్రజాస్వామ్యా పరిరక్షణ కై ఉద్యమిద్దాం
- కర్రె బిక్షపతి- సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి
- మోతే లింగారెడ్డి
- బి కే యం యు జాతీయ నాయకులు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 01 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

ఇండియాలో ఫ్యూడల్ క్యాపిటలిజం వర్ణ వ్యవస్థను సనాతన విధానాలతో దేశ ప్రజల మధ్య వివక్షతను విద్వేషాలను రెచ్చగొడుతూ కష్టజీవుల శ్రమ శక్తిని పెట్టు బడుదారులు దోచు కోవడానికి పాలకవర్గాలు పేద ప్రజల వ్యతిరేక విధానాలు అవలంబి స్తున్నాయని కర్రే బిక్షపతి హనుమకొండ జిల్లా సిపిఐ కార్యదర్శి మోతే లింగారెడ్డి కేంద్రంపై ధ్వజమెత్తారు శుక్రవారం హసన్ పర్తి మండలం లోని పలు గ్రామాల్లో 141వ మే డే సందర్భాన్ని పురస్కరించు కొని ఎర్రజెండాలు ఎగురవేసి మేడే ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లౌకిక ప్రజాస్వామ్య రాజ్యాంగ పరిరక్షణకై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 1886లో అమెరికా చికాగో నగరంలో పని గంటల తగ్గింపు కొరకు వేతనాల పెంపు కొరకు జరిగిన సమ్మె రక్త పాతంగా పాలకులు మార్చి వేసి కార్మికుల్ని కాల్చివేసినారు కార్మికులు చిందించిన రక్తం లోనిదే ఈ ఎర్రజెండా అని నేడు ప్రపంచంలో కోట్లాది పేదలకు అండగా నిలిచింది ఎర్రజెండా అని తెలిపారు. ఎల్లాపూర్ గ్రామంలో రేణి కుంట్ల రాజయ్య, నేదునూరి సాంబయ్య, బుర్ర ప్రభాకర్, రేణికుంట్ల చిరంజీవి. మడిపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ బుర్ర రంజిత్, హమాలీ లీడర్ చెల్ పూరి రాము జక్కుల సాంబరాజు ముంజ సతీష్ అనంతసాగర్ గ్రామంలో గిన్నారపు రాజు. సుబ్బయ్య పల్లిలో పుట్ట బిక్షపతి ఎంఆర్పిఎస్ రాష్ట్ర యువజన సంఘం ప్రెసిడెంట్ వస్కుల భరత్. సూదన పెల్లిలో తిక్క సూర్య పుట్ట రవీందర్. జయగిరి లో గడ్డం చంద్రమౌళి యాటకాల కుమారస్వామి ఎర్రజెండాల ను ఎగురవేసి గ్రామ గ్రామాన మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం జరిగినది ఈ కార్యక్రమంలో నేదునూరి రాజమౌళి హనుమకొండ జిల్లా సిపిఐ కార్యవర్గ సభ్యులు మెట్టు శ్యాం సుందర్ రెడ్డి హసన్ పర్తి మండల సిపిఐ కార్యదర్శి ఎర్ర నాగరాజు, ఎర్ర కుమారస్వామి వడ్లూరి సుధాకర్, గోపరాజు భద్రయ్య, గోపు బుచ్చిరెడ్డి, నాంపల్లి లక్ష్మయ్య రేణికుంట్ల దుర్గాప్రసాద్, జక్కుల సాంబరాజు చల్ పూరి రాము ముంద సతీష్ కల్వచర్ల వెంకటేశ్వర్లు జక్కుల రమేష్ వెంకటేష్ కుమారస్వామి ఏ రాజమౌళి సుంచు వాసు తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో షీ టీం మరియు ఏహెచ్‌టీయూ బృందాలు అవగాహన సదస్సులు..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 01 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా లో ప్రజా పాలన ప్రగతి పాలన కార్యక్రమంలో భాగంగా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో షీ టీం మరియు ఏహెచ్‌టీయూ (యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్) బృందాలు ఈరోజు ఆసిఫాబాద్ లోని బూరుగుడ ట్రైబల్ డిగ్రీ కాలేజ్ మరియు లోకల్ లీడర్స్ మే డే సందర్భంగా కార్మికులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మహిళల భద్రత, చిన్నారుల రక్షణ, లింగ సమానత్వం, సైబర్ నేరాల నివారణ, బాల్య వివాహాల నిర్మూలన, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ బాల కార్మిక వ్యవస్థ వంటి అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే అత్యవసర సమయంలో సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్లు, చట్టపరమైన రక్షణల గురించి వివరించారు.అసిఫాబాద్ షీ టీం ఇన్చార్జ్ ఎస్సై బిక్కులాల్, షీ టీం సిబ్బంది స్వప్న, రజిని, వరలక్ష్మి, దినేష్ తదితరులు పాల్గొన్నారు.ప్రజలు ఇటువంటి అవగాహన కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని తమ భద్రతపై అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.






# విద్యుత్ భద్రతా వారోత్సవాలు ప్రారంభం..

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 01**

**(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో విద్యుత్ వినియోగంలో భద్రతపై అవగాహన పెంపొందించేందుకు మే 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు విద్యుత్ భద్రతా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు టీజీఎన్‌పీడీ సీఎల్ అధికారులు ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఖ. హరిత, డీఆర్ఓ లోకేశ్వర్ రావు, ఎస్ఈ ఆపరేషన్ సర్కిల్ ఉత్తమ్ జాడే సంయుక్తంగా వాల్ పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ కే. హరిత మాట్లాడుతూ విద్యుత్ భద్రతపై వినియోగదారులు, రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రతి అధికారిక సమావేశంలో విద్యుత్ భద్రత అంశాన్ని చేర్చి ప్రజల్లో చైతన్యం పెంచాలని ఆదేశించారు. విద్యుత్ ప్రమాదాలను 'జీరో స్థాయికి' తీసుకురావడమే ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు.విద్యుత్ వినియోగంలో నిర్లక్ష్యం, అజాగ్రత్త కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని, సేఫ్టీ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా వాటిని నివారించవచ్చని పేర్కొన్నారు.వారోత్సవాల్లో చేపట్టే కార్యక్రమాలువిద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా పలు ముఖ్య చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.విద్యుత్ ప్రమాదాల నివారణకు ప్రణాళికలు, సాంకేతిక పద్ధతులు అమలుఅత్యవసర వైద్య విధానాలపై అవగాహన కార్యక్రమాలు ,గ్రామాలు, వ్యవసాయ క్షేత్రాల్లో సర్వేలు నిర్వహణ మీటర్లు, సర్వీస్ వైర్లు, స్విచ్ బోర్డుల తనిఖీలు ప్రమాదాలకు గురైన వారిని రక్షించే విధానాలపై శిక్షణ ప్రజలకు సూచనలు విద్యుత్ శాఖ ప్రజలకు పలు భద్రతా సూచనలు జారీ చేసింది,విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదు,ప్రమాద సూచనలు కనిపిస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలిరైతులు మోటార్ స్టార్టర్ వద్ద సరైన ఇన్సులేషన్ ఏర్పాటు చేయాలి,తడి నేలపై నిలబడి స్విచ్ ఆన్ చేయకూడదువిద్యుత్ లైన్ల సమీపంలో లోహ పరికరాల వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవాలి.అవగాహన సదస్సులుగ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి విద్యుత్ వినియోగంలో జాగ్రత్తలు, ప్రాథమిక చికిత్స విధానాలపై ప్రజలకు మార్గదర్శనం అందిస్తున్నారు. వంగిన స్తంభాలు, పాత వైర్లు గుర్తించి తక్షణ మరమ్మతులు చేపడుతున్నారు. సహాయం కోసంప్రజలు ఎలాంటి విద్యుత్ సమస్యలు లేదా ప్రమాద సూచనలు గమనించిన వెంటనే 24 గంటల టోల్ ఫ్రీ నంబర్ 1912 కు కాల్ చేసి సహాయం పొందవచ్చని అధికారులు తెలిపారు.

# తుమిడిహేటి ప్రాణహిత వద్ద సీఎం పర్యటనకు ఏర్పాట్లు పరిశీలన....

**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 01(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తుమిడిహేటి ప్రాణహిత నది వద్ద ఈ నెల 7న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హరిత, ఎస్పీ నితికపంత్, సబ్ కలెక్టర్ శ్రద్ధ శుక్లా,ఎమ్మెల్సీ దండే విఠల్ శుక్రవారం ప్రాంతాన్ని పరిశీలించారు. కార్యక్రమ ఏర్పాట్లు, భద్రత, పార్కింగ్, జనసమ్మేళనం నిర్వహణపై అధికారులకు సూచనలు ఇచ్చారు. సంబంధిత శాఖలు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు.





# వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే డే కార్యక్రమాలు..






**కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 01**

**(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ పట్టణంలో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఉదయం 5 గంటల నుండి 7 గంటల వరకు అన్ని రంగాల యూనియన్‌లు తమ తమ ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలను పూర్తి చేసుకున్నాయి.

అనంతరం ఉదయం 8 గంటలకు కాగజ్‌నగర్‌లోని స్టేట్ బ్యాంక్ ముందు నుండి భారీ ప్రదర్శన ప్రారంభమైంది. ఈ ప్రదర్శన రాజీవ్ గాంధీ చౌరస్తా, మార్కెట్, అంబేద్కర్ చౌరస్తా మీదుగా సాగి, అనంతరం సభ జరిగింది.

ఈ సభలో సి ఐ టి యు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు శ్రీమతి ఆర్. త్రివేణి మాట్లాడుతూ, మే 1 కార్మిక వర్గ చరిత్రలో ఒక గొప్ప పోరాట దినమని పేర్కొన్నారు. ఎనిమిది గంటల పని దినం కోసం చికాగోలో ప్రాణత్యాగం చేసిన కార్మికుల స్ఫూర్తిని గుర్తుచేశారు. కార్మిక హక్కులు పోరాటాల ద్వారానే సాధ్యమయ్యాయని, మేడే రోజు కేవలం జ్ఞాపక దినం కాకుండా భవిష్యత్తు పోరాటాలకు సంకల్ప దినమని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న లేబర్ కోడ్స్ కార్మికుల హక్కులపై తీవ్రమైన దాడి చేస్తున్నాయని విమర్శించారు. పని గంటలు పెరగడం, కనీస వేతనాల పెంపు లేకపోవడం, యూనియన్ హక్కుల బలహీనత, సమ్మె హక్కుపై పరిమితులు, కాంట్రాక్ట్ ఉద్యోగాల పెరుగుదల వంటి అంశాలు కార్మికులను అసురక్షిత పరిస్థితుల్లోకి నెట్టుతున్నాయని తెలిపారు. ఈ విధానాలు కార్మిక సంక్షేమం కోసం కాకుండా కార్పొరేట్ లాభాల కోసం రూపొందించబడినవని పేర్కొన్నారు.

ప్రత్యేకంగా అసంఘటిత రంగ కార్మికులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, మహిళలు, యువతపై ఈ లేబర్ కోడ్స్ తీవ్ర ప్రభావం చూపుతాయని హెచ్చరించారు. కార్మికులు ఐక్యంగా నిలబడి ఈ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా కార్మిక హక్కులను కాపాడేందుకు ప్రతిజ్ఞ చేయాలని, లేబర్ కోడ్స్‌ను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

పట్టణంలోని పలు ప్రాంతాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. మున్సిపల్ ఆఫీస్ వద్ద ఈ. శంకర్, సర్దార్ బస్తీలో కె. శ్రీనివాస్, ట్రాక్టర్ డ్రైవర్స్ యూనియన్ తరఫున తిరుపతి, బిల్డింగ్ వర్కర్స్ తరఫున గౌస్ బాబా, ఆశ యూనియన్ తరఫున పద్మ, సి ఐ టి యు కార్యాలయం ముందు ఎం. ఆనంద్ కుమార్, యస్ పి ఎమ్ పాత గేట్ వద్ద ముంజం శ్రీనివాస్, సంజీవయ్య కాలనీలో ప్రవీణ్ కుమార్, ఎలక్ట్రిసిటీ ఆఫీస్ వద్ద ఆ. శ్రీనివాస్ జెండాలు ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సిర్పూర్ పేపర్ మిల్ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కూశన రాజన్న, చెంద్రన్న, సంజీవ్, వై. అరుణ తదితరులు పాల్గొన్నారు. హమాలీ, బిల్డింగ్, మోటార్, యస్ పి ఎమ్, మున్సిపల్, ఆశ, అంగన్వాడీ, ఎమ్ డి ఎమ్ తదితర యూనియన్ల కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగుల ఆరోగ్యానికి పెద్దపీట

## - ఉద్యోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు

## - ఏపీఎస్ఆర్టీసీ ఎండీ, వైస్ చైర్మన్ ఎన్ బాలసుబ్రహ్మణ్యం

**అమరావతి,మే1 (నేషనలిస్ట్ వాయిస్ )**

ఏపీఎస్ఆర్టీసీలో అన్ని విభాగాల్లోని ఉద్యోగులకు ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఈ సంస్థలోని ఉద్యోగులకు వైద్య పరీక్షలు తప్పనిసరి చేసింది. ఈ మేరకు ఏపీఎస్ఆర్టీసీ ఎండీ, వైస్ చైర్మన్ ఎన్ బాలసుబ్రహ్మణ్యం శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని జారీ చేసిన ఆ ఆదేశాల్లో ఎండీ స్పష్టం చేశారు. డ్రైవర్లు, కండక్టర్లకు ప్రతి ఆరు నెలకు.. ఇతర ఉద్యోగులకు ఏడాదికి ఒకసారి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ సంస్థలో ప్రివెంటివ్ హెల్త్ కేర్‌కు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. అందుకోసం అన్ని జిల్లాల్లో ఈ పరీక్షలు ప్రారంభించారు. ఏపీఎస్ఆర్టీసీలో ప్రతి ఏడాది సుమారు 300 మంది ఉద్యోగులు మరణిస్తున్నారు. ఆర్టీసీ ఆసుపత్రులు, డిస్పెన్సరీలలో డ్రైవర్లలో గుండె సంబంధిత వ్యాధి లక్షణాలు పెరుగుతున్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో సంస్థలోని ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమైంది. దీంతో ఏపీఎస్ఆర్టీసీలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌బీఐ హెల్త్/లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలని ఉద్యోగులకు సూచించారు. పిరియాడికల్ చెకప్‌లో రక్త పరీక్షలు చేర్చే ప్రతిపాదనను పరిశీలిస్తున్నారు. ముందస్తు పరీక్షలతో ప్రాణ రక్షణ సాధ్యమని అధికారులు భావిస్తున్నారు.

# జిల్లాలో ఆర్వోబీ పనులపై కలెక్టర్ సమీక్ష

## - కుడా కార్యాలయంలో జాతీయ రహదారులు,- రైల్వే, ఆర్ అండ్ బీ, కుడా అధికారులతో సమీక్ష నిర్వహించిన

## -కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మే 01 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)**

హనుమకొండ లోని కుడా కార్యాలయంలో జాతీయ రహదారులు, రైల్వే, రోడ్లు భవనాల శాఖ, కుడా అధికారులతో జిల్లాలో జాతీయ రహదారులు, ఆర్ఓబీల నిర్మాణ అభివృద్ధి పనులపై హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి శుక్రవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కరుణాపురం వద్ద ఉన్న ఆర్వోబీ తో పాటు బావుపేట, కోమటి పల్లి ఆర్వోబీ ల సంబంధించిన పెండింగ్ అనుమతులపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. కరుణపురం వద్ద ఉన్న ఆర్వోబీ అలైన్ మెంట్ కు సంబంధించిన ప్రాజెక్ట్ రిపోర్టును అందజేయాలని కలెక్టర్ అన్నారు. కరుణపురం, బావుపేట, కోమటిపల్లి ఆర్వోబీ సంబంధించి చేపట్టనున్న పనులపై చర్చించారు. ఈ సమావేశంలో జాతీయ రహదారుల శాఖ అధికారి లింగయ్య, సికింద్రాబాద్ డివిజన్ రైల్వే డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ కౌశల్ పాండే, అధికారి దేవరాజ్, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, కుడా సీపీవో అజిత్ రెడ్డి, భూసేకరణ విభాగం సూపరింటెండెంట్ జగత్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# ఉత్తమ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ - జిల్లా కలెక్టర్ నాగరాణి






తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 1 (నేషనలిస్ట్ వాయిస్ )

కష్టాలకు స్పందించే గుణం ఉన్న మంచి వ్యక్తి ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో శు క్రవారం నిర్వహించిన దివ్యాంగుల పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వ పింఛన్లు మంజూరు కాని 40 మంది దివ్యాంగులకు ఎమ్మెల్యే తన సొంత నిధులతో పింఛన్లు ఇవ్వాలని నిర్ణయించారు. ప్రభుత్వ పింఛన్లు మంజూరయ్యే వరకూ ఈ పింఛన్లు ప్రతినెలా ఇస్తామని ఎమ్మెల్యే ప్రకటించారు. పింఛన్ల పంపిణీని కలెక్టర్ నాగరాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధనవంతులు చాలామంది ఉంటారని కానీ ఎదుటి వారి కష్టాన్ని చూసి స్పందించే గుణం కొందరికే ఉంటుందన్నారు. అలాంటి ఉత్తమ వ్యక్తిత్వం ఉన్న బొలిశెట్టి శ్రీనివాస్ ఎమ్మెల్యే కావటం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 175 మంది ఎమ్మెల్యేలలో బొలిశెట్టి శ్రీనివాస్ ఉత్తమ పనితీరుతో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సాధించారని అన్నారు. ఏదో ఒకటి రెండు అంశాలతో కాకుండా 20 అంశాల ప్రాతిపదికగా ఎమ్మెల్యేల పనితీరును అంచనా వేశారని, ముఖ్యమంత్రి పర్యవేక్షణలో జరిగే ఈ ఎంపికలో ఎమ్మెల్యే శ్రీనివాస్ ద్వితీయ స్థానం సాధించడం ఆయన ఉత్తమ పనితీరుకు నిదర్శనమన్నారు. నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన తపన పడుతుంటారని, తరచుగా కలెక్టర్ కార్యాలయానికి ఫోన్ చేసి వివిధ అభివృద్ధి పనులను చేయించవలసిందిగా కోరడం ఆయన నిబద్ధతను తెలియజేస్తుందన్నారు. నియోజకవర్గంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకోవడం లక్షలాది రూపాయలు దానధర్మాలు చేయడం ఆయన అసాధారణ వ్యక్తిత్వానికి నిదర్శనమని, ఆయన కుటుంబ సభ్యులు అందుకు సహకరించడం అభినందనీయమని అన్నారు. ఎమ్మెల్యే శ్రీనివాస్ సంపూర్ణ ఆయు రారోగ్యాలతో ప్రజలకు సేవలు అందించాలని కలెక్టర్ ఆకాంక్షించారు. శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల ఆశయాల మేరకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దివ్యాంగులకు తన సొంత నిధులతో పింఛన్లు ఇవ్వాలని ఆలోచన తెలియజేసిన వెంటనే అందుకు అవసరమైన సలహాలను ఇచ్చి కలెక్టర్ నాగరాణి తదితర అధికారులు సహకరించారన్నారు. దాతృత్వం తాడేపల్లిగూడెం ప్రజలలో ఉందని, ఎమ్మెల్యేగా ఈ రెండేళ్లకాలంలో చేపట్టిన అనేక కార్యక్రమాలకు సుమారు రూ 6 కోట్ల రూపాయల వరకు దాతలు విరాళాలు ఇచ్చి సహకరించారన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి, బలుసులమ్మ జాతర, జిల్లా పరిషత్ పాఠశాల క్రీడా మైదానం అభివృద్ధి, ఇండోర్ స్టేడియం, ఈతకొలను తదితర కార్యక్రమాలను దాతల సహకారంతో విజయవంతంగా పూర్తి చేయగలిగామన్నారు. గత వైసిపి హయాంలో రాష్ట్ర ఖజానాను దోపిడీ చేశారని, అందువల్ల పథకాల అమలు చేయడానికి ప్రభుత్వం ఎంతో శ్రమ పడవలసి వస్తుందని అన్నారు. పింఛన్ల విషయంలో దాతలు ముందుకొస్తే బాగుంటుందన్నారు. ప్రజలు, ప్రభుత్వ అధికారుల సహకారంతోనే తాను ఈ కార్యక్రమాలు చేయగలుగుతున్నానని వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం రవాణా 700 దేశీ దారు బాటిళ్ల స్వాధీనం ఇద్దరు నిందితుల అరెస్ట్..

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా మే 01

(నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ మండలం లో అక్రమ మద్యం రవాణా విక్రయాలపై చట్టపరమైన చర్యలు కాగజ్‌నగర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ కుమారస్వామి, కాగజ్‌నగర్ సబ్ ఇన్స్పెక్టర్ సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, కాగజ్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో, 700 దేశీ దారు బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వివరా లలోకి వెళ్తే, దాదానగర్ గ్రామం లోని పోచమ్మ గుడి సమీపంలో శు క్రవారం ఉదయం సుమారు 08:00 గంటల సమయంలో సిర్పూర్-టి నుండి కాగజ్‌నగర్ వైపు వస్తున్న వీఎ34జ+ 4729 నంబర్ గల ూూ స్కూటీ అనుమానాస్పదంగా కనిపిం చడంతో పోలీసులు ఆపి తనిఖీ చేశారు. వాహనంలోని వ్యక్తులు సరైన పత్రాలు చూపించలేకపోవడంతో వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీలో మూడు ప్లాస్టిక్ సంచుల్లో మొత్తం 700 "రాకెట్ దేశీ దారు" (ప్రతి ఒక్కటి 90 మి.లీ.) బాటిళ్లు ఉన్నట్లు గుర్తించారు. మొత్తం 63 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకోగా, దాని సుమారు మార్కెట్ విలువ రూ. 25,200/-గా అంచనా వేశారు.

నిందితుల వివరాలు:

1. రెడ్డి సాయి కుమార్ (28 సంవ), అశోక్ కాలనీ, కాగజ్‌నగర్
2. నీటూరి సురేష్ (22 సంవ), సుభాష్ కాలనీ, కాగజ్‌నగర్

ప్రాథమిక విచారణలో, నిందితులు మహారాష్ట్ర రాష్ట్రంలో తక్కువ ధరకు మద్యం కొనుగోలు చేసి, కాగజ్‌నగర్ ప్రాంతంలో అధిక ధరకు అక్రమంగా విక్రయించి లాభం పొందాలనే ఉద్దేశంతో తరలిస్తున్నట్లు వెల్లడైంది. ఈ కేసులో మద్యం మరియు వాహనాన్ని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్ట్ చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టడం జరుగుతోంది. ఈ ఆపరేషన్‌లో పోలీస్ కానిస్టేబుల్ పి. దుర్గా ప్రసాద్ మరియు డి. దీపక్ లు కూడా పాల్గొన్నారు. **పోలీసుల విజ్ఞప్తి:**
అక్రమ మద్యం రవాణా లేదా విక్రయాలపై సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 ద్వారా తెలియచేయాలని సూచించారు.

# వంజిరి గ్రామంలో బుద్ధ పౌర్ణిమ వేడుకలు .....



సిర్పూర్ కాగజనగర్ ప్రతి నిధి.మే 01 (నేషనలిస్ట్ వాయిస్ న్యూస్)

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం వంజిరి గ్రామంలో బుద్ధ పౌర్ణిమి శుక్రవారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ బుద్ధుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భారత్, లింగయ్యతో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు. బుద్ధుడి శాంతి, అహింస, సమానత్వ బోధనలు సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. కోపం, ద్వేషం విడిచిపెట్టి కరుణ, మానవత్వంతో జీవించాలని సూచించారు. గ్రామంలో శాంతి, సామరస్య వాతావరణం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

# పదవ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన పాఠశాల విద్యార్థులకు సన్మానం

దేవరకద్ర, మే 1 (నేషనలిస్ట్ వాయిస్ )

మండల పరిధిలోని డోకూరు గ్రామ శివారులో ఉన్న తపోవను పాఠశాలలో ఈ సంవత్సరం 10వ తరగతి ఫలితాల్లో పాఠశాలకు చెందిన విద్యార్థిని వైష్ణవి 564 మార్కులు, కరుణ శ్రీ 560, జనని 557, చేతన్ రెడ్డి 552, దీక్షిత 551 మార్కులు సాధించడం జరిగింది. అలాగే మొత్తం విద్యార్థులలో 19 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించడం జరిగింది. మొత్తం విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించడం జరిగింది. అందుకుగాను ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ వర్కుటి నిరంజన్ రెడ్డి శుక్రవారం సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.










# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే..

దేవరకద్ర, మే 1 (నేషనలిస్ట్ వాయిస్ విణక్షం)

దేవరకద్ర మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన పలు వివాహ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆయన ఆశీర్వదించారు. శ్రీనివాస ఫంక్షన్ హాల్ లో జరిగిన అజి లాపురం బాలు కూతురు వివాహ వేడుకల్లో ఆల పాల్గొని నూతన దంపతులను ఆయన ఆశీర్వదించారు. ఆయన వెంట నరసింహారెడ్డి, శ్రీకాంత్ యాదవ్, చలమారెడ్డి, బాలరాజ్, సత్యం సాగర్, రాజు, కొండల్, రవి, తదితరులు పాల్గొన్నారు.



# పింఛన్లు పంపిణీ చేసిన గొర్రెల శ్రీధర్

తాడేపల్లిగూడెం ప్రతినిధి మే 1 (నేషనలిస్ట్ వాయిస్ )

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలు మేరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్‌గొర్రెల శ్రీధర్ స్థానిక 17,19వ వార్డుల్లో అర్హులైన పలువురు లబ్ధిదారులకు శుక్రవారం పింఛన్లు పంపిణీ చేశారు. ప్రతీ నెల మొదటి తారీకున పింఛన్ సొమ్ములు సక్రమంగా అందుతున్నాయా, ఏమైనా ఇబ్బందులున్నాయా అని లబ్ధిదారులను అడగగా, వారు ప్రతి నెల సొమ్ములు అందులో అందుతున్నాయని బదులివ్వటం విశేషం. ఈ కార్యక్రమంలో వద్రి అప్పారావు, 17వ వార్డు,19వ వార్డు సచివాలయ సిబ్బంది.. నాగబాబు, మాధవి, సూర్యచంద్ర , జ్యోతి, భవాని తదితరులు పాల్గొన్నారు.



# వైభవ్ విధ్వంసం చూసి జడుసుకున్న కేఎల్ రాహుల్



ఐపీఎల్ 2026 సీజన్ అనేక సంచలనాలకు వేదికవుతోంది. ముఖ్యంగా రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్‌ను ఆశ్చర్యపరుస్తున్నాడు. ఈ బుడతడి ఆటతీరు చూసి టీమిండియా స్టార్ క్రికెటర్, ఢిల్లీ క్యాపిటల్స్ ఓపెనర్ కేఎల్ రాహుల్ సైతం షాక్ అయ్యారు. తాను కలలో కూడా ఊహించని అద్భుతమిది అంటూ సూర్యవంశీ టాలెంట్‌పై రాహుల్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరగబోయే 43వ మ్యాచ్‌కు ముందు కేఎల్ రాహుల్ స్టార్ స్పోర్ట్స్‌తో మాట్లాడారు. ఈ సందర్భంగా రాజస్థాన్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "వైభవ్ సూర్యవంశీ ప్రపంచ క్రికెట్‌లో విధ్వంసం సృష్టిస్తున్నాడు. కేవలం 15 ఏళ్ల వయసులో ఐపీఎల్‌లో రెండు సెంచరీలు బాదడం అనేది అసాధారణం. నేను ఆ వయసులో ఉన్నప్పుడు కనీసం ఇలాంటి వాటి గురించి కలలో కూడా ఊహించలేదు" అని రాహుల్ కొనియాడారు. వైభవ్ ఇప్పటివరకు ఈ సీజన్‌లో 400 పరుగులు చేయడమే కాకుండా, అత్యధికంగా 37 సిక్సర్లు బాది అందరి దృష్టిని ఆకర్షించాడు. భారతదేశంలో పుట్టుకొస్తున్న యంగ్ టాలెంట్ గురించి రాహుల్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. గతంలో మన దగ్గర సిక్సర్లు కొట్టే ప్లేయర్లు లేరని ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ బ్యాటింగ్ చూసి భయపడేవాళ్లమని, కానీ ఇప్పుడు ఐపీఎల్ వల్ల ఆ పరిస్థితి మారిపోయిందని ఆయన అన్నారు. వైభవ్ సూర్యవంశీతో పాటు చెన్నై సూపర్ కింగ్స్ తరపున ఆడుతున్న ఆయుష్ మ్హాత్రే కూడా అద్భుతంగా రాణిస్తున్నాడని రాహుల్ పేర్కొన్నారు. ఈ కుర్రాళ్ళు భయం లేకుండా ఆడుతూ టీ20 క్రికెట్ ఆడే తీరునే మార్చేస్తున్నారని అభినందించారు. తన వ్యక్తిగత లక్ష్యాల గురించి స్పందిస్తూ రాహుల్ ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. తనకు వ్యక్తిగత రికార్డుల కంటే ట్రోఫీలు గెలవడమే ముఖ్యమని చెప్పారు. "నాకు పర్సనల్ మైల్‌స్టోన్స్ కంటే ఎంఎస్ ధోనీ గెలిచిన ఐదు ఐపీఎల్ ట్రోఫీల రికార్డును సమం చేయాలని ఉంది. క్రికెట్ అనేది ఒక టీమ్ గేమ్. సక్సెస్‌ఫుల్ టీమ్‌లో భాగం కావడమే నా లక్ష్యం" అని రాహుల్ స్పష్టం చేశారు. కేవలం రన్ మిషన్ లాగా మారడం కాకుండా, ఒక లీడర్‌గా తన జట్టుకు టైటిల్ అందించడమే తన డ్రీమ్ అని ఆయన చెప్పుకొచ్చారు.ఈ సీజన్‌లో రాజస్థాన్ రాయల్స్ జట్టు టాప్ ఫామ్‌లో ఉండటానికి వైభవ్ సూర్యవంశీ వంటి యంగ్ ప్లేయర్ల దూకుడే కారణం. జైపూర్‌లోని తమ హోమ్ గ్రౌండ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో తలపడనున్న రాజస్థాన్, ఈ మ్యాచ్‌లోనూ వైభవ్ మెరుపులపై ఆశలు పెట్టుకుంది. మరోవైపు ఢిల్లీ జట్టు రాహుల్ కెప్టెన్సీలో రాజస్థాన్ దూకుడుకు అడ్డుకట్ట వేయాలని చూస్తోంది. ఒకవైపు అనుభవం ఉన్న రాహుల్, మరోవైపు ఫ్యూచర్ స్టార్ వైభవ్.. వీరిద్దరి మధ్య జరగబోయే పోరు కోసం క్రికెట్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




# ఆరెంజ్ క్యాప్‌తో అభిషేక్ శర్మ, పర్పుల్ క్యాప్‌తో ఇషాన్ మలింగా!

ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తన అద్భుత ప్రదర్శనతో దూసుకెళ్తూ.. ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపిస్తుంది. వరుసగా 5 విజయాలతో అదరగొట్టింది ఎస్ఆర్‌హెచ్ టీమ్. కేవలం మ్యాచ్‌ల్లో విజయాలతోనే కాకుండా.. వ్యక్తిగత అవార్డుల పరంగా కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆధిపత్యం చాటుతోంది. ప్రస్తుతం ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్ రేసుల్లో టాప్‌లో సన్‌రైజర్స్ నిలిచింది.బ్యాటింగ్ విభాగంలో స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ అద్భుత ఫామ్‌లో కొనసాగుతున్నాడు. ఇప్పటివరకు 9 మ్యాచ్‌ల్లో ఏకంగా 209.35 స్ట్రైక్ రేట్ తో 425 పరుగులు చేసి ఆరెంజ్ క్యాప్ రేసులో ఫస్ట్ ప్లేస్‌లో నిలిచాడు. ఇందులో ఒక సెంచరీ, మూడు హాఫ్ సెంచరీలు ఉన్నాయి. తన సూపర్ బ్యాటింగ్‌తో జట్టుకు మంచి ఆరంభాలు అందిస్తున్నాడు. ఇక అభిషేక్ శర్మకు తోడుగా కాటేరమ్మ కొడుకు హెన్రిచ్ క్లాసెన్ కూడా సూపర్ ఫామ్‌తో అదరగొడుతున్నాడు. క్లాసెన్ కూడా 414 పరుగులతో రెండో స్థానంలో కొనసాగుతూ ఉన్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్‌లో మిడిల్ ఓవర్లలో జట్టుకు స్థిరత్వాన్ని అందిస్తూ భారీ స్కోర్లను అందిస్తున్నాడు. మరోవైపు బౌలింగ్ విభాగంలో ఇషాన్ మలింగా కళ్లు చెదిరే ప్రదర్శనతో పర్పుల్ క్యాప్ రేస్‌లో మొదటి స్థానానికి దూసుకొచ్చాడు. 9 మ్యాచ్‌ల్లో 15 వికెట్లు తీసి టాప్‌లో నిలిచాడు. అతని బౌలింగ్ సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తోంది. డెత్ ఓవర్లలో మలింగ వేసే యార్కర్లు, వేరియేషన్స్ ప్రత్యర్థి బ్యాటర్లను కట్టడి చేస్తున్నాయి. అలాగే బౌలింగ్‌లో ఇషాన్ మలింగా తర్వాత భువనేశ్వర్ కుమార్, జోఫ్రా ఆర్చర్‌లు కూడా వికెట్ల వేటలో దూసుకొస్తున్నారు.





# భువనేశ్వర్?ను టీమ్ ఇండియా?లోకి తీసుకోవాలి

భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు?? స్టార్ పేసర్? భువనేశ్వర్? కుమార్? ఈ ఐపీఎల్? సీజన్?లో అద్భుతంగా రాణిస్తున్నాడు. అత్యుత్తమ ఫామ్?తో ఆడుతూ ప్రతి మ్యాచ్?లో కనీసం ఒకట్రెండు వికెట్లు పడగొడుతున్నాడు. కీలక సమయాల్లో పరుగులు కట్టడి చేస్తూ మళ్లీ పాత భువీని గుర్తుచేస్తున్నాడు. అలా ప్రస్తుత సీజన్?లో అతడు జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ క్రమంలో అతడిపై ప్రశంసలు కురుస్తున్నాయి. తాజాగా భువీ ఫామ్?పై భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. భువీ పేరును టీ20 జట్టుకు పరిశీలించాలని అన్నాడు. ఈ మ్యాచ్ తర్వాత క్రిక్‌బజ్ చర్చలో పాల్గొన్న సెహ్వాగ్ భువనేశ్వర్? కమ్?బ్యాక్ గురించి సెలక్టర్లు ఆలోచించాలని సూచించాడు. "భువనేశ్వర్ ఈ సీజన్?లో? అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. అతని బౌలింగ్ చూడటం నిజంగా ఆనందాన్నిచ్చింది. మళ్లీ మనకు పాత భువనేశ్వర్? కనిపిస్తున్నాడు. అతని బౌలింగ్‌లో పదును ఉంది. ప్రతి మ్యాచ్‌లోనూ 2 నుంచి 3 వికెట్లు తీస్తున్నాడు. తాజా మ్యాచ్?లో కూడా 3 వికెట్లు పడగొట్టాడు. ఈ మ్యాచ్?లో ఆర్సీబీకి విజయావకాశాలు దగ్గర చేశాడు. అందుకే అతడికి 35ఏళ్లా, 36 ఏళ్లా అనేది చూడవద్దు' 'ఇంత బాగా బౌలింగ్ చేస్తుంటే టీ20లో కమ్‌బ్యాక్ ఇవ్వాల్సిందే. సెలెక్టర్లు దీని గురించి ఆలోచించాలి. భువీ ఒకట్రెండు కాదు దాదాపు అన్ని జట్లపై రాణిస్తున్నాడు. టాప్ క్వాలిటీ బ్యాటర్లపై అతను పైచేయి సాధిస్తున్నాడు. అందుకే అతడి బౌలింగ్ చూస్తే ముచ్చటేస్తుంది. అతడు బుమ్రాతో కలిస్తే టీమ్‌ఇండియా చాలా బలంగా మారుతుంది" అని వీరేంద్ర సెహ్వాగ్ అభిప్రాయపడ్డాడు. కాగా, ఈ? ఐపీఎల్?లో 9 మ్యాచ్‌లు ఆడిన భువనేశ్వర్ 17వికెట్లుతీసిపర్పుల్‌క్యాప్‌రేసులో అగ్రస్థానంలోఉన్నాడు.ఎకానమీరేట్7.54гఉంది.ఇక ఇదే చర్చలో పాల్గొన్న మాజీ స్పిన్నర్ మురళీ కార్తీక్ కూడా భువీని ప్రశంసలతో ముంచెత్తాడు."భువనేశ్వర్ అత్యుత్తమ బౌలర్?. అతనికి లెన్ అండ్ లెంగ్త్? మార్చడంలో నైపుణ్యం ఉంది. అయితే ఎక్కువగా టెస్ట్? మ్యాచ్?లు ఆడటం వల్లే అతడికి ఈ నైపుణ్యం వచ్చింది. యార్కర్, లెంగ్త్ బాల్,? షార్ట్ బాల్ ఇలా ఏ విధంగా అయినా బౌలింగ్ చేయగల కెపాసిటీ భువీకి ఉంది. టీ20లో ఇదే అత్యంతముఖ్యం కూడా. ఓసారి భువీ కెరీర్?ను గమనిస్తే, 2011 నుంచిఇప్పటిదాకాఅతడు215వికెట్లుపడగొట్టాడు. ఎకానమీ రేట్ 7.7 కంటే తక్కువగానే ఉంది.

# కెప్టెన్ హార్దిక్ పాండ్యా నిందించడం సరికాదు

## వెస్టిండీస్ దిగ్గజం ఇయాన్ బిషప్



ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఆడిన ఎనిమిది మ్యాచుల్లో ఆరు ఓటములతో ప్లేఆఫ్ ఆశలు గల్లంతయ్యే స్థితిలో ఉన్న ఈ టీమ్ ప్రదర్శనపై ఇప్పుడు తీవ్రంగా చర్చ కొనసాగుతోంది. అయితే జట్టు వైఫల్యానికి కేవలం కెప్టెన్ హార్దిక్ పాండ్యాని మాత్రమే బాధ్యుడిని చేయడం సరికాదని వెస్టిండీస్ దిగ్గజం ఇయాన్ బిషప్ అభిప్రాయపడ్డారు. సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా వంటి స్టార్ ప్లేయర్లు కూడా బాధ్యత తీసుకోవాలని ఆయన సూచించారు. ముంబై ఇండియన్స్ ఎదుర్కొంటున్న వరుస ఓటములపై హార్దిక్ పాండ్యా స్పందిస్తూ.. తన వ్యక్తిగత ఫామ్ మెరుగుపడాల్సిన అవసరం ఉందని నిజాయితీగా అంగీకరించాడు. అయితే ఇయాన్ బిషప్ మాట్లాడుతూ.. "జట్టు ఫెయిల్యూర్ లో ఒక్క వ్యక్తిని బాధ్యుడిని చేయడం తప్పు. కెప్టెన్ దగ్గర ఎన్ని ప్లాన్స్ ఉన్నా, ప్లేయర్లు మైదానంలో రాణించకపోతే ఫలితం ఉండదు. హార్దిక్ వ్యూహాలు మార్చుకోవచ్చు, కానీ అతనికి స్టార్ ప్లేయర్ల సపోర్ట్ చాలా అవసరం" అని అన్నారు. సన్ రైజర్స్ తో జరిగిన గత మ్యాచ్ లో 243 పరుగులు చేసి కూడా కాపాడుకోలేకపోవడం ముంబై బౌలింగ్ వైఫల్యాన్ని ఎత్తిచూపుతోంది. ముంబై టీమ్ లో ప్రధాన బలమైన సూర్యకుమార్ యాదవ్, జస్ప్రీత్ బుమ్రా ఈ సీజన్ లో ఆశించిన స్థాయిలో రాణించడం లేదు. సూర్యకుమార్ 8 మ్యాచుల్లో కేవలం 162 పరుగులు మాత్రమే చేశాడు, అతని సగటు 20కి పడిపోయింది. ఇక బుమ్రా పరిస్థితి మరీ ఘోరం. ఐపీఎల్ చరిత్రలోనే ఇది అతనికి అత్యంత కష్టతరమైన సీజన్ అని చెప్పొచ్చు. ఆడిన 8 మ్యాచుల్లో అతను కేవలం రెండు వికెట్లు మాత్రమే తీయగలిగాడు. ప్రపంచ స్థాయి బౌలర్ ఇలాంటి ప్రదర్శన ఇస్తాడని ఎవరూ ఊహించలేదు. టీ20 ప్రపంచకప్ 2026 గెలిచిన తర్వాత బుమ్రా, సూర్య వంటి కీలక ఆటగాళ్లకు తగినంత విశ్రాంతి దొరకలేదని బిషప్ విశ్లేషించారు. "వరల్డ్ కప్ గెలవడానికి వారు ఎంతో శ్రమించి ఉంటారు. మానసికంగా, శారీరకంగా వారు అలసిపోయి ఉండొచ్చు. నిజానికి బుమ్రా వంటి బౌలర్ కు ఐపీఎల్ కు ముందు తగినంత బ్రేక్ ఇచ్చి ఉంటే బాగుండేది. అప్పుడు అతను కొత్త ఉత్సాహంతో, తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుని బరిలోకి దిగేవాడు" అని బిషప్ అభిప్రాయపడ్డారు. ముంబై ఇండియన్స్ ఇప్పుడు అత్యంత క్లిష్ట పరిస్థితిలో ఉంది. ప్లేఆఫ్స్ రేసులో నిలవాలంటే మిగిలిన ఆరు మ్యాచుల్లోనూ కచ్చితంగా గెలవాల్సిందే. ఒక్క మ్యాచ్ ఓడినా ఇంటికి వెళ్లడం ఖాయం. ఈ పరిస్థితిలో కేవలం హార్దిక్ పాండ్యా వైపు చూడకుండా, జట్టులోని ప్రతి ఆటగాడు బాధ్యత తీసుకుని రాణించాల్సిన సమయం ఆసన్నమైంది. పోలార్డ్, జయవర్ధనే వంటి దిగ్గజాలు కూడా ఇదే విషయాన్ని నొక్కి చెప్పారు.

# సన్‌రైజర్స్ లోకి అంబరీష్ ఎంట్రీ




ఈ ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ తడాఖా చూపుతోంది. భారీ విజయాలతో దూసుకెళ్తోంది. వరుసగా అయిదు విజయాలను తన ఖాతలో వేసుకుంది. మొన్నటికి మొన్న ముంబై ఇండియన్స్ ను వాళ్ల సొంత గడ్డ వాంఖెడే స్టేడియంలో చితగ్గొట్టడం అదరహో అనిపించుకుంది. ఈ మ్యాచ్ లో ఓడిన దెబ్బకు ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో అట్టడుగుకు చేరింది. ప్లేఆఫ్స్ పై దాదాపుగా ఆశలు వదులుకున్నట్టయింది. ఇప్పటివరకు తొమ్మిది మ్యాచ్ లు ఆడిన సన్ రైజర్స్ ఆరింట్లో నెగ్గింది. మూడింట పరాజయాన్ని చవి చూసింది. మొత్తం 12 పాయింట్లతో పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతోంది. ఇంకా అయిదు మ్యాచ్ లు ఆడాల్సి ఉందీ జట్టుకు ఇందులో ఇంకో మూడు గెలిస్తే నేరుగా ప్లేఆఫ్స్ రేసులో ఉంటుంది పాట్ కమ్మిన్స్ సేన.ఈ పరిస్థితుల్లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టులో కీలక మార్పు చోటు చేసుకుంది. గాయపడ్డ శివం మావి స్థానంలో 18 ఏళ్ల సీమ్ బౌలింగ్ ఆల్‌రౌండర్ ఆర్ఎస్ అంబరీష్ ఎంట్రీ అయ్యాడు. అతనితో కాంట్రాక్ట్ ను కుదుర్చుకుంది జట్టు మేనేజ్మెంట్.





# ది ప్యారడైజ్ నుంచి మరో పాట విడుదలకు రెడీ

'ది ప్యారడైజ్' చిత్రంతో ప్రేక్షకుల్ని అలరించేందుకు సిద్ధమవుతున్నారు కథానాయకుడు నాని. ఆయన నటిస్తున్న ఈ పాన్ ఇండియా సినిమాని శ్రీకాంత్ ఓదెల తెరకెక్కిస్తున్నారు. సుధాకర్ చెరుకూరి నిర్మాత. కయాదు లోహర్ కథానాయిక. మోహన్‌బాబు, రాఘవ్ జుయల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా నుంచి బయటకొచ్చిన ఆయా షేర్. పాటకి ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ దక్కిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇందులోని రెండో గీతాన్ని విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. మే రెండో వారంలో దీన్ని బయటకు వదలనున్నారని.. ఇదో ప్రేమ గీతంగా ఉండనుందని సమాచారం. పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా ముస్తాబవుతున్న ఈ సినిమాని ఆగస్టు 21న థియేటర్లలోకి తీసుకు రానున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. దీనికి తగ్గట్లుగానే మే చివరి నాటికి చిత్రీకరణ పూర్తి చేయాలన్న లక్ష్యంతో చిత్ర బృందం షూటింగ్‌ను పరుగులు పెట్టిస్తోంది. ఈ చిత్రానికి అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.


# మరోమారు సుకుమార్-రామ్‌చరణ్ కాంబో

## పెద్ది విడుదల తరవాత పట్టాలెక్కనున్న ప్రాజెక్ట్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ ప్రస్తుతం దర్శకుడు బుచ్చిబాబు సానతో కలిసి తన 16వ చిత్రం పెద్దిలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా ఇప్పటికే భారీ అంచనాలు సొంతం చేసుకోగా, తదుపరి ప్రాజెక్ట్‌పై కూడా అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. చరణ్ కెరీర్‌లో 17వ సినిమాగా దర్శకుడు సుకుమార్‌తో ఓ భారీ పాన్ ఇండియా చిత్రం తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ కాంబినేషన్ అనౌన్స్ అయినప్పటి నుంచే ఇండస్ట్రీలో మంచి బజ్ క్రియేట్ అయింది. గతంలో సుకుమార్,చరణ్ కాంబినేషన్‌లో వచ్చిన 'రంగస్థలం' భారీ విజయాన్ని అందుకోవడంతో, ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. తాజా సమాచారం ప్రకారం, 'పెద్ది' సినిమా విడుదల తర్వాత రామ్ చరణ్ ఎక్కువ గ్యాప్ తీసుకోకుండా వెంటనే తన 17వ సినిమాను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. 'పెద్ది' జూన్‌లో విడుదల కానుండగా, అదే నెలలో సుకుమార్ ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభించే ఎ÷-లాన్‌లో ఉన్నట్లు సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రాన్ని మైత్రి మూవీ మేకర్స్‌తో పాటు సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మించనున్నారు. భారీ బ్జడెట్‌తో, పాన్ ఇండియా స్థాయిలో ఈ సినిమాను రూపొందించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. సుకుమార్ తన ప్రత్యేకమైన కథనం, డిఫరెంట్ టేకింగ్‌తో సినిమాలను తెరకెక్కించడంలో పాపులర్ కాగా, రామ్ చరణ్ కూడా తన నటనతో ప్రేక్షకులని మరింత అలరించే దిశగా ముందుకు సాగుతున్నారు. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రాబోయే ఈ సినిమా మరోసారి ఇండస్ట్రీలో కొత్త రికార్డులు సృష్టిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు. ఏదిఏమైన 'పెద్ది' తర్వాత గ్యాప్ లేకుండా చరణ్ కొత్త సినిమా స్టార్ట్ చేయనున్నాడనే వార్త మెగా ఫ్యాన్స్‌లో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తోంది. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక వివరాలు త్వరలో వెల్లడయ్యే అవకాశం ఉంది.








# బాలయ్యతో సినిమాకు శేఖర్ కమ్ముల యత్నం?

టాలీవుడ్‌లో కొన్ని కాంబినేషన్ల గురించి మొదట వినగానే ఆశ్చర్యంగా అనిపిస్తాయి. కానీ అవి నిజమైతే మాత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించే అవకాశం ఉంటుంది. ఇప్పుడు అలాంటి అరుదైన కాంబినేషన్ గురించి ఫిల్మ్ నగర్ వర్గాల్లో జోరుగా చర్చ నడుస్తోంది. క్లాస్ సినిమాల దర్శకుడిగా పేరొందిన శేఖర్ కమ్ముల, మాస్ హీరో నందమూరి బాలకృష్ణతో సినిమా చేయబోతున్నారనే వార్త ప్రస్తుతం ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. శేఖర్ కమ్ముల సినిమాలు అంటే సహజత్వం, భావోద్వేగాలు, సమాజానికి సంబంధించిన అంశాలు ప్రధానంగా కనిపిస్తాయి. 'ఆనంద్', 'గోదావరి', 'హ్యాపీ డేస్' వంటి చిత్రాలతో ఆయన క్లాస్ దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. 'లీడర్' సినిమా ద్వారా రాజకీయ నేపథ్యంతో కూడిన కథను కూడా బలంగా చూపించారు. మరోవైపు బాలకృష్ణ అంటే హై వోల్టేజ్ యాక్షన్, గంభీరమైన డైలాగ్స్, మాస్ ఎలిమెంట్స్ గుర్తుకొస్తాయి. ఈ ఇద్దరి స్టైల్ పూర్తిగా భిన్నమైనప్పటికీ, అదే ఈ కాంబినేషన్‌పై ఆసక్తిని పెంచుతోంది. ఇటీవల శేఖర్ కమ్ముల కథల ఎంపికలో కొత్త కోణాలను ప్రయత్నిస్తున్నారని టాక్. ఇక బాలయ్య కూడా వరుస విజయాలతో ఫామ్‌లో ఉండటంతో పాటు, కేవలం యాక్షన్ మాత్రమే కాకుండా సమాజానికి సందేశం ఇచ్చే బలమైన కథలో నటించాలని ఆసక్తి చూపుతున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో శేఖర్ కమ్ముల చెప్పిన ఒక పవర్‌ఫుల్ కథాంశం బాలయ్యను ఆకట్టుకుందని చెబుతున్నారు. ఈ సినిమా ఒక పొలిటికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. ఇందులో బాలకృష్ణ ఒక వ్యవస్థను ప్రశ్నించే నాయకుడిగా లేదా సమాజంలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో ముందుకు సాగే పాత్రలో కనిపించవచ్చని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. శేఖర్ కమ్ముల భావోద్వేగాల మేళవింపు, బాలయ్య శక్తివంతమైన తెరపైన ప్రెజెన్స్ కలిస్తే ప్రేక్షకులకు ఒక కొత్త అనుభవం లభించడం ఖాయం అని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ ప్రాజెక్ట్ అధికారికంగా ప్రకటిస్తే మాస్, క్లాస్ ప్రేక్షకులిద్దరినీ థియేటర్లకు రప్పించే శక్తి ఈ కాంబోకు ఉందని విశ్లేషకులు అంటున్నారు.







# గందరగోళంలో పడేసేలా..జెట్లీ మూవీ

మత్తు వదలరా' సిరీస్ చిత్రాలతో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు రితేశ్ రానా. ఇప్పుడు సత్యతో కలిసి ఆయన రూపొందించిన సినిమా 'జెట్లీ'. ప్రజాపతి (అజయ్) వ్యాపారవేత్త. రూ.15 వేల కోట్ల బ్యాంకింగ్ స్కామ్‌కు పాల్పడి.. దేశం వదిలి దుబాయ్ పారిపోతాడు. దీంతో కేంద్ర హోం మంత్రి మేల్కోటి (శ్రీనివాస్ వడ్లమాని) అతన్ని అరెస్ట్ చేసి తిరిగి దేశానికి రప్పించే బాధ్యతను భారత ఇంటెలిజెన్స్‌కి అప్పజెప్తాడు. అయితే, అప్పటికే జజీరా సిండికేట్‌తో పాటు ఇంకొంత మంది శత్రువుల నుంచి తన ప్రాణాలకు ముప్పు ఉందని తెలియడంతో.. ప్రజాపతి స్వయంగా లొంగిపోయినట్లు నటించి, ఆ తర్వాత తప్పించుకోవాలని ఓ ప్రణాళిక రచిస్తాడు. అతన్ని దుబాయ్ నుంచి కొచ్చికి ప్రత్యేక విమానంలో తీసుకొస్తుండగా.. ఆ స్కామ్‌లో భాగమైన మిగతా వ్యక్తులు తనని చంపేందుకు ఓ ప్రణాళిక రచిస్తారు. ఇలా భారత ఏజెంట్స్ నుంచి తప్పించుకోవాలని ప్రజాపతి.. అతన్ని చంపాలని శత్రువులు ప్రయత్నిస్తున్న తరుణంలో ఆ విమానంలోకి గతం మర్చిపోయిన స్థితిలో డాక్టర్ వేదవ్యాస్ (సత్య) పాత్ర ఎంట్రీ ఇస్తుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అసలు వేదవ్యాస్ ఎవరు? తన వల్ల ప్రజాపతి ఎస్కేప్ ప్లాన్ ఎలా తలకిందులైంది? ప్రజాపతి శత్రువుల్ని అతనెందుకు అడ్డుకున్నాడు? ఆఖరికి ఆ విమానం సేఫ్‌గా కొచ్చిలో ల్యాండ్ అయిందా? లేదా? ఈ కథలో ఏజెంట్ శివానీ రాయ్ (రియా సింఘా), సినీ సుడోకు ఆడుకునే వెన్నెల కిశోర్ పాత్రలకు ఉన్న ప్రాధాన్యత ఏంటి? అన్నది సినిమా చూసి తెలుసుకోవాలి.'మత్తు వదలరా', 'హ్యాపీ బర్త్‌డే' సినిమాలు చూసిన వారికి రితేశ్ కామెడీ స్టైల్, తన చిత్రాల్లోని పాత్రలు ఎంత గమ్మత్తుగా ఉంటాయన్నది తెలిసే ఉంటుంది. ఈ 'జెట్లీ' కూడా పూర్తిగా అదే మీటర్‌లో సాగే టిపికల్ కామెడీ కథతో.. చిత్రమైన క్యారెక్టరైజేషన్లతో నిండి ఉంటుంది. ఈ కథంతా పూర్తిగా ఓ విమానంలోనే జరుగుతుంటుంది. బ్యాంకింగ్ స్కామ్‌కి పాల్పడిన ఓ బిజినెస్‌మ్యాన్‌ని ప్రాణాలతో చట్టం ముందు నిలబెట్టాలని రా ఏజెంట్స్.. అతన్ని దారిలోనే చంపేయాలని శత్రువులు.. వీళ్లందరి ప్రణాళికల్ని తారుమారు చేసే హీరో పాత్ర.. ఇలా లైన్‌గా చూసినప్పుడు కథంతా ఆసక్తిరేకెత్తించేలా అనిపిస్తుంది.

# ఓటిటిలోకీ ఎంట్రీ ఇచ్చిన రాకాస

యంగ్ హీరో సంగీత్ శోభన్ ప్రధాన పాత్రలో, నయన్ సారిక హీరోయిన్‌గా నటించిన హారర్ కామెడీ చిత్రం రాకాస ఇప్పుడు ఓటీటీలోకి వచ్చేసింది. దర్శకురాలు మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రం థియేటర్లలో మంచి స్పందన అందుకున్న తర్వాత డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమైంది. చిన్న సినిమాగా వచ్చినప్పటికీ, మంచి నిర్మాణ విలువలు, వినోదాత్మక కథతో ప్రేక్షకులను ఆకట్టుకున్న 'రాకాస' ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ వేదికగా నేటి నుంచి స్ట్రీమింగ్ అవుతోంది. థియేటర్లలో మిస్ అయిన వారు ఇప్పుడు ఈ సినిమాను ఇంటి వద్దే ఆస్వాదించే అవకాశం పొందుతున్నారు. ఈ సినిమా హారర్ ఎలిమెంట్స్‌తో పాటు కామెడీ మేళవింపుతో అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా రూపొందించబడింది. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్, పిల్లలతో కలిసి చూసేందుకు సరదాగా ఉండే కంటెంట్‌గా ఇది నిలుస్తుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. వీకెండ్ లేదా హాలిడే టైంలో ఫ్యామిలీతో కలిసి చూడడానికి ఇది మంచి ఆప్షన్‌గా చెప్పవచ్చు. ఈ చిత్రాన్ని నిహారిక కొణిదెల సమర్పించగా, జీ స్టూడియోస్ నిర్మాణ బాధ్యతలు చేపట్టింది. టెక్నికల్‌గా కూడా సినిమా మంచి స్థాయిలో ఉండటం, వినోదాన్ని అందించే కథా రూపకల్పన ఉండటం ఈ చిత్రానికి ప్లస్‌గా మారాయి. మొత్తానికి థియేటర్లలో మంచి టాక్ తెచ్చుకున్న 'రాకాస' ఇప్పుడు ఓటీటీలో మరింత విస్తృతమైన ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమైందని చెప్పాలి. హారర్ కామెడీ జానర్‌ను ఇష్టపడే వారికి ఈ సినిమా బెస్ట్ ఆప్షన్‌గా నిలుస్తోంది. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను దక్కించుకున్నట్టు తెలుస్తుంది. మెగా డాటర్ నిహారిక కొణిదెల తన హోమ్ బ్యానర్ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ ద్వారా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఈ చిత్రానికి మానస శర్మ దర్శకత్వం వహించారు. హారర్ ఎలిమెంట్స్‌కు స్వచ్ఛమైన కామెడీని జోడించి రూపొందించిన ఈ కథాంశం అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంది. ముఖ్యంగా వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీనుల కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది.

PRINTED AND PUBLISHED by VASISTA PRINTERS 18-97, 306, 3RD FLOOR, RAJINIGANDHA COMPLEX, KAMALA NAGAR, CHAITANYAPURI, SAROORNAGAR, RANGAREDDY, TELANGANA - 500060, RNI No :TGTEL/25/A4284 EDITOR KOMMU SRINIVAS, Contact - 9666023180 & 8096660656